ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

7

ఆదివారం 28 సెప్టెంబరు 2025



లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేతకు సిద్ధం

● రికార్డులు స్వాధీనం చేయాలని ఆర్జేడీ ఉత్తర్వులు ● డిప్యూటీ ఈవోకు బాధ్యతల అప్పగింత 8



స్థానిక సంస్థలకు.. మొండిచేయి!

ఏడాదిగా జమ కాని స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి



- మూడు జిల్లాల్లో రూ.100 కోట్లకు పైగా దస్తావేజు రుసుం బకాయి
- ప్రభుత్వం ఆదేశిస్తేనే ఖజానాకు ప్రొసీడింగ్స్
- నిధుల లేమితో కునారిల్లుతున్న పురాల, పంచాయతీలు

ప్రభుత్వం స్థానిక సంస్థలకు మొండిచేయి చూపుతోంది. ఏడాదిగా స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ మునిసిపాలిటీలు.. పంచాయతీలకు జమ కాలేదు. దీంతో నిధుల లేమితో స్థానిక పాలన కునారిల్లుతోంది. కొన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. పారిశుధ్య పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి విడుదల చేయాలని స్థానిక సంస్థల పాలక వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నా వాటి మొర ఆలకించే పరిస్థితి కనిపించడం లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సర్‌చార్జి బకాయి రూ.100 కోట్లకు పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జడ్పీ ఖాతాలకు సర్‌చార్జి నిధులు 2024 జూలై నుంచి జమ కావడం లేదు. ఈ నిధులన్నీ ప్రభుత్వమే వాడేసింది. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి నిధులు ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా ద్వారా స్థానిక సంస్థలకు జమవుతాయి. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి స్థానిక సంస్థల వారీగా ప్రొసీడింగ్స్ ఖజానాకు పంపిస్తారు. ఖజానా శాఖ అధికారులు మునిసిపాలిటీలు, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఖాతాలకు నిష్పత్తి ప్రకారం నిధులు జమ చేస్తారు. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 శాతం సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు.. ఒక వంతు చొప్పున జడ్పీ, మండల




నరసరావుపేట జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

> మునిసిపాలిటీ, పంచాయతీ పరిధిలోని ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు, పొలాల క్రయ విక్రయాలు జరిగితే స్టాంపు డ్యూటీ సర్ చార్జీని స్థానిక సంస్థల ఖాతాలకు జమ చేయాలి. ఒక స్థిరాస్తి కోటి రూపాయలకు విక్రయం జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ.1.5 లక్షలు సంబంధిత పంచాయతీ లేదా మునిసిపాలిటీ ఖాతాకు జమ చేయాలి. పంచాయతీ పరిధిలో జరిగే ఆస్తుల విక్రయాలకు సంబంధించి నిష్పత్తి ప్రకారం పంచాయతీతో పాటు మండల, జిల్లా పరిషత్తుల ఖాతాలకు సర్‌చార్జిలు జమ చేయాలి. విక్రయించిన ఆస్తి తాలూకా పేర్ల మార్పులు స్థానిక సంస్థలు చేయాలి. చట్ట ప్రకారం ప్రతి రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా నిర్ణయించిన శాతం సర్‌చార్జి స్థానిక సంస్థలకు జమ కావాల్సిందే.

(మిగతా 8వ పేజీలో)

అద్భుతంగా.. ఆర్టీసీ



సిటీ బస్‌స్టాప్ (ఊహాచిత్రం)

- కాలుష్య రహిత రవాణాపై కసరత్తు
- నవనగరాల్లో తొమ్మిది బస్‌స్టేషన్లు, డిపోలు
- అమరావతి శివార్లలో మూడు భారీ టెర్మినల్స్
- 165 ఎకరాలు కేటాయించాలని సీఆర్డీఏకి వినతి

అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. కాలుష్య రహితంగా.. ప్రపంచ రాజధానిగా రూపొందుతోన్న అమరావతికి ఏ మాత్రం తీసిపోనట్లుగా.. రాజధానిలో బస్‌స్టేషన్లు, డిపోలు, టెర్మినల్స్ నిర్మాణానికి ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ మేరకు అమరావతిలో అవసరమైన భూములకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి ఏపీసీఆర్డీఏకు ఆర్టీసీ అధికారులు వినతి పత్రం అందజేశారు. ఒకవైపు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయాన్ని తలదన్నేలా విమానాశ్రయం, పెదపరిమి-నెక్కల్లు మధ్య 15 వందల ఎకరాల్లో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఆర్టీసీ కూడా ముందుకు వచ్చింది. అమరావతి 2.0లో రాజధానిలో వివిధ సంస్థలు భారీగా నిర్మాణాలు చేపడుతుండగా.. ఆర్టీసీ కూడా రాజధానిలో భావి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూముల కేటాయింపుపై సీఆర్‌డీఏను ప్రత్యేకంగా కోరింది.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

ఎన్నో విశిష్టతలు.. మరెన్నో రకాల ప్రత్యేకతలతో యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా రూపుదాలుస్తున్న రాజధాని అమరావతిలో రవాణా సదుపాయాలు ఏవిధంగా ఉంటాయోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అన్ని రకాల రవాణా సౌకర్యాలను ప్రయాణికులకు.. ఆహ్లాదకరమైన అనుభూతులను పంచేలా ప్రయాణికులను మైమరిపించేలా సదుపాయాలను వినూత్నంగా విభిన్నంగా ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం అమరావతిలో అద్భుతమైన రోడ్‌గ్రిడ్‌ను రూ.వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. నగరానికి వాయు, రైలు, రోడ్డు కనెక్టివిటీలను విస్తృతంగా పెంచడంతోపాటు జల రవాణా సదుపాయాలను కల్పించి ప్రయాణికులను, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకోవాలని భావిస్తుంది. ప్రస్తుతం అమరావతి నిర్మాణపనులు ఊపందుకోవడంతోపాటు భూములను పొందిన కొన్ని సంస్థలు (మిగతా 8వ పేజీలో)

బస్ టెర్మినల్ (ఊహాచిత్రం)



జీఎస్టీ 2.0తో ఒక్కో కుటుంబానికి

రూ.3240 లబ్ధి

జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఎంవీ ప్రసాద్

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 ద్వారా ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువులపై రూ.3240 ఆదా చేసుకునే అవకాశం కలుగుతుందని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు.



జిల్లా పౌరసరఫరాల అధికారిని సన్మానిస్తున్న వ్యాపారులు

శనివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీభవన్నారాయణ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌'పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీని 5, 12 శాతాలకు పరిమితం చేశారన్నారు. మార్పు చేసిన జీఎస్టీ శ్లాబుల వివరాలను వ్యాపారులు దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి ప్రదర్శించాలన్నారు. ఏ వస్తువు ఏ మేరకు ధర తగ్గిందో వినియోగదారుడికి స్పష్టంగా వివరించాలని తెలిపారు. జీఎస్టీ-1 నరసరావుపేట మండల నోడల్ అధికారి పున్నారెడ్డి మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీని అమలు చేయకుండా వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీ కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి యజ్ఞనారాయణ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 అమలు పర్యవేక్షణ కమిటీలు నూతన జీఎస్టీ శ్లాబులు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షిస్తాయన్నారు. తగ్గిన ధరలకు అనుగుణంగా క్రయవిక్రయాలు చేయాలని వ్యాపారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వనమా సాంబశివరావు, కార్యదర్శి సతీష్‌కుమార్, ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కే కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు, వన్ టౌన్, టూ టౌన్ కిరాణా మర్చంట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, పంతంగి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా బాలచాముండికా అమ్మవారు

శ్రీ లలితా త్రిపురసుందరిగా అమ్మవారు

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి అమరేశ్వరాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం బాలచాముండికా అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. భక్తులకు అర్చకులు ఆశీర్వ చనాలు అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతుండగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం

డ్వాక్రా రుణాలపై నివేదిక సమర్పించాలి ● పేదరిక నిర్మూలన ప్రణాళికపై కలెక్టర్ కృతికాశుక్లా

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారాలు ప్రారంభించేలా, పారిశ్రామికంగా రాణించేలా ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులకు తెలిపారు. గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రణాళికపై శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించడం, నిర్వహించడంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించి విజయవంతమైన పరిశ్రమల సందర్శన కార్యక్రమాలు మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 3000 మహిళా వ్యాపారులు, వారు నిర్వహిస్తున్న సంస్థల డేటా బేస్ సక్రమంగా నిర్వహించాలన్నారు. డ్వాక్రా సంఘాలు కోరిన రుణాలు, బ్యాంకుల వారీగా మంజూరైన రుణాలు, పెండింగ్‌లో ఉన్న రుణాలు, మంజూరుకు ఎదురవుతున్న సమస్యలపై మండలాల వారీగా అధికారులు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. యడ్లపాడులో మునగ చెట్ల పెంపకంపై నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, ఎల్డీఎం రామ్‌ప్రసాద్, పరిశ్రమల శాఖ ఏజీఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

బస్‌షెల్టర్ నిరుపయోగం

- బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షణ
- ప్రయాణికులకు ఉపయోగపడిన వైనం

శావల్యాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షలు వెచ్చించి ప్రయాణికులు వేచి ఉండేందుకు అనేక ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు నిర్మిస్తున్నారు. అయితే ఈ షెల్టర్లు అవసరమైన ప్రాంతాల్లో నిర్మించకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందుకు శావల్యాపురం సెంటర్లో నిర్మించిన బస్‌షెల్టర్ ఉదాహరణగా చెప్పవచ్చు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వివిధ పనుల కోసం వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ పట్టణాలకు వెళ్లేందుకు శావల్యాపురానికి వచ్చి అక్కడి నుంచి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. శావల్యాపురం నుంచి వినుకొండకు కేవలం 10 కిమీ దూరం కావడంతో ఎక్కువ మంది బైకులు, ఆటోల్లో వెళ్తుంటారు. అయితే వినుకొండకు వెళ్లే మార్గంలోని గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనే శావల్యాపురం సెంటర్‌లో బస్‌షెల్టర్‌ను నిర్మించారు. ఇక్కడ ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి లేదు. దీంతో బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. నరసరావుపేట, గుంటూరు, విజయవాడకు వెళ్లే ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండ, వానల్లో రోడ్డుపై నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ, వానల్లో అయితే మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్త్రీశక్తి పథకంతో మహిళా ప్రయాణికులు పెరిగారు. వీరందరూ రోడ్డుపైనే ఉండాల్సి వస్తోంది. ఎదురుగా బస్‌షెల్టర్ ఉన్నా ప్రయాణికులు మండుటెండలో నిలబడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించి నరసరావుపేట వెళ్లే వైపు కూడా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



శావల్యాపురంలో నిరుపయోగంగా బస్‌షెల్టర్



బస్సుల కోసం మండుటెండలో రోడ్డుపై ప్రయాణికులు



దాచేపల్లి మండలంలో పత్తిపంట

పత్తి సాగు పెరిగింది

అదే స్థాయిలో కంది, మొక్కజొన్న

- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన సాగు
- జిల్లాలో మిరప సాగుపై రైతుల్లో నిరాసక్తి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి సాగు ఈ ఏడాది అధికమైంది. అదే స్థాయిలో కంది మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కాగా సాధారణంగా జిల్లాలో అత్యధికంగా మిరప సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది మిరప సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. దీంతో గత ఏడాదితో పోలిస్తే మిరప పంట తక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. జిల్లాలో మొత్తం లక్షా 57 వేల హెక్టార్ల భూమి ఉండగా అందులో ఈ ఏడాది పత్తి 68 వేల 220 హెక్టార్లలో సాగు చేయగా, గత ఏడాది 57 వేల 524 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. కంది పంట ఈ ఏడాది 15 వేల 564 హెక్టార్లలో సాగు చేయగా, గత ఏడాది 14 వేల 116 హెక్టార్లలో సాగుచేశారు. వాణిజ్య పంటలైన పెసలు, మినుములు, ఆవాలు ఈ ఏడాది 39 వేల 583 హెక్టార్లలో సాగు చేయగా, గత ఏడాది 34 వేల 378 హెక్టార్లలో సాగు చేశారు. కాగా మిరప పంట గత ఏడాది 35 వేల 292 హెక్టార్లలో సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికి 5 వేల హెక్టార్లలోనే సాగులో ఉంది. ఈ ఏడాది వరి 22 వేల 902 హెక్టార్లలో సాగు చేశారు. గత ఏడాది 19 వేల 480 హెక్టార్లలో సాగు చేశారు.

ఈ-క్రాప్ నమోదు కాకుంటే నష్టమే

రైతులు సాగుచేస్తున్న ప్రతీ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలి. అలా చేయకుండా పంటలు సాగు చేస్తే అమ్మకాల సమయంలో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఈ-క్రాప్ నమోదులో చూపిన పంటలకు మాత్రమే కొనుగోలుకు అవకాశం ఉంటుందంటున్నారు. లేకుంటే పంట ఉత్పత్తులను విక్రయించాలంటే రైతులు ఇబ్బందులు పడాల్సి ఉంది. ఇప్పటికే పిడుగురాళ్ల డివిజన్ వ్యవసాయ శాఖ పరిధిలో వరి 13,634 హెక్టార్లు, పత్తి 10,363 హెక్టార్లు, కంది 8,541 హెక్టార్లు, మిరప 3 వేల హెక్టార్లలో సాగులో ఉండగా సగం కూడా ఈ-క్రాప్‌లో నమోదు కాలేదు. మరో నెలలో సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆ కేంద్రాలలో పత్తిని విక్రయించాలంటే ఈ-క్రాప్‌లో నమోదు తప్పనిసరి. ఈ-క్రాప్ నమోదు కాకుంటే పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు కూడా రైతులకు అందే అవకాశం ఉండదు. ఈ క్రాప్ నమోదుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. రైతులు స్పందించి పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



పిడుగురాళ్ల సమీపంలో సాగులో వరిపైరు



జూలకల్లు వద్ద సాగులో ఉన్న కంది పైరు

సంస్థలు పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో పర్యాటకాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యే సంస్థలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం పర్యాటకశాఖ అధికారులు, హౌస్‌బోట్స్ క్రూయిజ్ అభివృద్ధి, హౌస్‌బోట్స్ బిల్డర్స్ ఆపరేటర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కృష్ణా నదీ తీరపు ప్రకృతి సౌందర్యం, సముద్ర తీరం, కృష్ణానది బ్యాక్‌వాటర్, మడ అడువులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయని తెలిపారు. సూర్యలంక సముద్ర తీరం నుంచి నిజాంపట్నం వరకు క్రూయిజ్, హౌస్‌బోట్స్ కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదన అందజేస్తే తగిన సహకారం అందిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో సందర్శకులను ఆకర్షించేలా సూర్యలంక బీచ్‌కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సూర్యలంక హౌస్‌బోట్స్ సర్వేలో పాల్గొనే వారి వివరాలను కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ జీఎం నాంచారయ్య, ఇతర రాష్ట్రాలకు చెందిన హౌస్‌బోట్స్ బిల్డర్‌లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేతకు సిద్ధం

- రికార్డులు స్వాధీనం చేయాలని ఆర్జేడీ ఉత్తర్వులు
- డిప్యూటీ ఈవోకు బాధ్యతల అప్పగింత



లూథరన్ ఉన్నత పాఠశాల

యడ్లపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే తొలి ఉన్నత పాఠశాల.. లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మూసివేతకు చర్యలు ప్రారంభమయ్యాయి. నరసరావుపేట డిప్యూటీ ఈవో సుభాని శనివారం పాఠశాలకు చేరుకుని రికార్డులను స్వాధీనం చేయాలని హెచ్ఎంను కోరారు. దీంతో పాఠశాల సిబ్బంది రికార్డులను అప్పగించే పనిలో నిమగ్నమయ్యారు. ఏడు దశాబ్దాలకు పైగా విద్యాబుద్ధులు అందించిన పాఠశాల.. ఏఈఎల్‌సీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మూత వేయడం ఈ ప్రాంత వాసులను కలచి వేసింది. విద్యాశాఖ ఆర్జేడీ ఆదేశాల మేరకు రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నామని డిప్యూటీ ఈవో సుభాని తెలిపారు. స్వాధీన ప్రక్రియ మూడు నుంచి నాలుగు రోజులు పడుతుందన్నారు. రికార్డులను స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరచనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న హెచ్ఎం, ఇద్దరు ఎస్‌జీటీ లతోపాటు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్లను వేరొక చోటకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వీరంతా జిల్లా విద్యాశాఖాధికారికి ఇప్పటికే రిపోర్టు చేశారని.. త్వరలోనే వీరిని మరోచోట సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు.

ఏపీని క్రీడలకు కేంద్రంగా మారుస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం క్రీడా రంగ అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించిందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని క్రీడలకు కేంద్రంగా మారుస్తామని ఆయన పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను పీవీఎన్ మాధవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రకాల క్రీడలకు అవసరమైన సదుపాయాలు రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. చిన్న వయసు నుంచే ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతామని మాధవ్ పేర్కొన్నారు. చెస్‌ను ప్రతి పాఠశాలలో భాగం చేయాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవిక్రిష్ణ మాట్లాడుతూ, మానవ చరిత్రలో అత్యుత్తమమైన ఆటల్లో చెస్ ఒకటని అన్నారు. ఈ ఆట కేవలం వినోదం కోసమే కాదని, మానసిక శక్తిని పెంచే సాధనమని పేర్కొన్నారు. చెస్ ఓపిక, క్రమశిక్షణ, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే గుణాన్ని నేర్పుతుందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్నపీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకే రవిక్రిష్ణ

సాంఘిక పెట్టుబడే అభివృద్ధికి పునాది

- విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్

గుంటూరుకార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అనుభవాలను పరిశీలిస్తే సాంఘిక పెట్టుబడి ప్రబలంగా ఉన్న దేశాలే వేగంగా అభివృద్ధి చెందాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ పేర్కొన్నారు. భారతదేశంలో ప్రజలను కులాలు, మతాల వారీగా విభజించడం వల్లే త్వరగా అభివృద్ధి చెందలేకపోతున్నామని అన్నారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన చేయూత ఫౌండేషన్ ప్రారంభోత్సవ సభకు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1990లో భారతదేశం, చైనా తలసరి ఆదాయం చేరో 330 డాలర్లు ఉండగా, నేడు చైనా 14,800 డాలర్లకు చేరుకుందని చెప్పారు. భారతదేశం మాత్రం 2,600 డాలర్లకే పరిమితమైందని అన్నారు. భారత సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికి చేయూత ఫౌండేషన్ లాంటి సంస్థలు ప్రధాన పాత్ర పోషించాలని, నైపుణ్యం గల విద్యను ప్రతిభ గల పేదలకు అందించాలని రమేశ్ కోరారు. అనంతరం మానవతావాది బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి మాట్లాడుతూ, నేటి విద్యాసంస్థలు నైపుణ్యాలు అందించకుండా డిగ్రీలను అందజేసే ఉత్పత్తి కేంద్రాలుగా కొనసాగుతున్నాయన్నారు. అత్యున్నత ప్రతిభ కలిగి పేదరికాన్ని అనుభవిస్తున్న విద్యార్థులకు వారు స్థిర పడే వరకు చేయూతనివ్వాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ, పాప పుణ్యాల పరిధిని దాటి దాతృత్వం వైపు అడుగులు వెయ్యాలని కోరారు. విద్య, పరిశోధనలపై పెట్టుబడులు పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ ఆడిటర్ టీజేపీఎస్ కళాశాల సెక్రటరి కె.వి బ్రహ్మం, కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్, మానవత చైర్మన్ పావులూరి రమేశ్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి. ధనుంజయ రెడ్డి, కౌండిన్య ఐఏఎస్ వ్యవస్థాపకులు ఇ.వి. నారాయణ, ప్రముఖ విద్యా వేత్త కన్నా మాస్టర్ పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి అధ్యక్షత వహించారు.



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్

అద్భుతంగా ఆర్టీసీ

(7వ పేజీ తరువాయి)

తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చి పనులను చేపడుతున్నాయి. సీడ్‌యాక్సిస్ రోడ్డు వెంబడే తమకు భూములు కేటాయించాలని మరికొన్ని సంస్థలు ప్రభుత్వపెద్దలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ క్రమంలో రాజధానిలో బస్‌స్టేషన్ల ఏర్పాటుకు 165 ఎకరాలను కేటాయించాలని ఏపీఎస్‌ఆర్టీసీ సీఆర్‌డీఏకు విన్నవించుకుంది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ ఈ ఏడాది జూన్‌లోనే లిఖితపూర్వక విజ్ఞాపనపత్రాన్ని సీఆర్‌డీఏకు అందజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వపెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లారు. రాజధాని అమరావతి నగరంలో తిరిగే సిటీ సర్వీసులన్నీ పూర్తిగా ఎలక్ట్రిక్ లేదా, బ్యాటరీ వాహనాల రూపంలోనే ఉంటాయి. దీనివలన అమరావతిలో కాలుష్యం గణనీయంగా తగ్గనున్నది. ఆర్టీసీ నుంచి మూడు నెలల క్రితం సీఆర్‌డీఏకు ఈ ప్రతిపాదనలు అందినప్పటికీ ఎందువలనో ఆ సంస్థకు భూ కేటాయింపులు చేయలేదు. ఆర్టీసీకి భూ కేటాయింపులు, బస్‌స్టేషన్లు, డిపోల ఏర్పాటు తదితరాలన్నీ కూడా రాష్ట్రప్రభుత్వ పరిధిలో ఉండే అంశాలే కాబట్టి.. ప్రభుత్వం ఒకింత జాప్యం చేస్తుండవచ్చని భావించాలి.

మూడు టెర్మినల్స్.. తొమ్మిది బస్‌స్టేషన్లు

నవ నగరాల్లో ఎక్కడికక్కడ అంటే బస్‌స్టేషన్, దానికి అనుబంధంగా డిపోను ఏర్పాటు చేసేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళికలను రూపొందించారు. ఒక్కో నగరంలో బస్‌స్టేషన్‌కు ఐదెకరాలు, డిపోకు ఇంకో ఐదెకరాలు.. వెరసి ఒక్కోచోట పదెకరాల చొప్పున నవనగరాల్లో కలిపి 90 ఎకరాలను కేటాయించాలని ఆర్టీసీ కోరుతుంది. నగరానికి మూడు వైపులా మూడు భారీ ఇంటర్‌చేంజ్ టెర్మినల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఒక్కో టెర్మినల్స్ కోసం 25 ఎకరాల వంతున మూడు టెర్మినల్స్‌కు కలిపి 75 ఎకరాలు అవసరమని ఆర్టీసీ భావిస్తుంది. ఈ టెర్మినల్స్‌లో సుదూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు దిగి అక్కడి నుంచి సిటీ సర్వీసులను వినియోగించుకుని రాజధాని నగరంలో తాము వెళ్లాల్సినచోటుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

- హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల కోసం రాయపూడి సమీపంలో ఓ టెర్మినల్
- బెంగళూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం నీరుకొండ, పెదపరిమి మధ్య ఓ టెర్మినల్
- ఉత్తరాంధ్ర, రేపల్లె ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం మంగళగిరి పశ్చిమ శివారులో మరో టెర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ప్రతిపాదిస్తోంది.

ఏపీ ఎడ్‌సెట్ చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన ఎడ్‌సెట్-2025 చివరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రవేశాల కన్వీనర్ ఆచార్య స్వామి శనివారం విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వచ్చే నెల 5 నుంచి 7 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా కళాశాలలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌లో మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 8న చేసుకోవాలని ఆయన చెప్పారు. వెబ్ ఆప్షన్స్ ఇచ్చిన అభ్యర్థులకు వచ్చే నెల 10న ప్రవేశాలు కేటాయిస్తామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు అక్టోబరు 13న వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని చెప్పారు. అదేరోజు బీఈడీ తరగతులు ప్రారంభమవుతాయని కన్వీనర్ స్వామి పేర్కొన్నారు.

నేడు ఏపీ పీజీసెట్ రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్

కళాశాలల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ఆదివారం విడుదల చేస్తున్నట్లు ఏపీ పీజీసెట్-2025 కన్వీనర్ ఆచార్య రవికుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 30 నుంచి వచ్చే నెల 5 వరకు జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా వచ్చే నెల ఒకటి నుంచి ఐదులోపు కళాశాలలు నమోదు చేసుకోవాలని ఆయన వివరించారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ద్వారా ఇచ్చిన కళాశాలల్లో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకుంటే వచ్చే నెల 6న చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు వచ్చే నెల 8న ప్రవేశాలు కేటాయిస్తామని చెప్పారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు వచ్చే నెల 8 నుంచి 11 లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాలన్నారు. నూతన విద్యార్థులకు పీజీ తరగతులు వచ్చే నెల 8న ప్రారంభమవుతాయని కన్వీనర్ రవికుమార్ పేర్కొన్నారు.

'జ్యోతి'కి ఉద్యోగ కల్పన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంధత్వంతో బాధపడుతూ కుమారుని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న పాముల పాటి జ్యోతికి ఉద్యోగం కల్పించారు. పాత గుంటూరులో నివాసం ఉంటున్న జ్యోతి గురించి 'పాపం జ్యోతి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించగా.. ఈ కథనానికి రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో జ్యోతికి ఉద్యోగం కల్పిస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దివ్యాంగులశాఖ సహాయ సంచాలకులు డి. దుర్గాబాయి మాట్లాడుతూ జ్యోతి ఎనిమిదేళ్ల కుమారుడు కొద్ది రోజుల క్రితం న్యూమోనియా వ్యాధికి గురికాగా జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేటట్లు చేశారన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మోటారు సైకిల్ - కారు ఢీ : వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం కాకాని గ్రామం వద్ద మోటారు సైకిల్-కారు ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పిడుగురాళ్ళ మండలం జానపాడు గ్రామానికి చెందిన రహంతుల్లా (45) తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తొలుత నరసరావుపేటలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించే సమయంలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న రాజేష్‌దిగా మృతుని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కొత్త అజయ్ (ఫైల్)

వినుకొండటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతిచెందిన ఘటన వినుకొండలో శుక్రవారం జరిగింది. నూజెండ్ల మండలం ఓబనపాలెం గ్రామానికి చెందిన కొత్త అజయ్ (21) కుటుంబసభ్యులతో కలిసి గత ఏడేళ్లుగా బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో జీవనం సాగిస్తున్నారు. అతడి స్నేహితుడు అశోక్ గ్రామానికి సమీపంలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం షాపును అద్దెకు తీసుకున్నాడు. షాపుకు ఫ్లెక్సీలు కట్టేందుకు తోడుగా అజయ్‌ను తీసుకెళ్లాడు. ఫ్లెక్సీలు కడుతుండగా సమీపంలోని వీధిలైట్ల విద్యుత్ వైర్లు తగిలి అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి

కారంపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన శనివారం కారంపూడిలో జరిగింది. నరసరావుపేటకు చెందిన ముగ్గురు బాలురు పదో తరగతి చదువుతూ దసరా సెలవులు నిమిత్తం వారి పెద్దమ్మ గారి ఊరైన కారంపూడికి చెందిన జాహీరా ఇంటికి వచ్చారు. దుస్తులు ఉతికేందుకు జాహీరా వెళుతుండగా ఆమెతోపాటు ఖాదర్‌వలి, నాగుల్‌మీరా, సయ్యద్ సత్తార్ సరదాగా ఈత కొట్టేందుకు వినుకొండ రోడ్డులో గల సాగర్ కుడికాలువకు వెళ్లారు. ఈత కొడుతూ ముగ్గురూ మునిగిపోయారు. స్థానికులు గమనించి ఖాదర్‌వలి, నాగుల్‌మీరాను రక్షించగా సయ్యద్ సత్తార్ నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సత్తార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు గురై రైతు మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురై రైతు మృతి చెందిన పిడుగురాళ్ల మండలంలోని చెన్నాయపాలెంలో శనివారం జరిగింది. చెన్నాయపాలెం గ్రామానికి చెందిన జంగిటి శ్రీనివాసరావు (45) తన బెండ తోటలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు పోలీసులు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సంక్షేమ గ్రూపు డైరెక్టర్‌గా రాములు బాధ్యతలు



తుళ్లూరు సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్నల్ వెలుగోటి రాములు సీఆర్ డీఏ సామాజిక సంక్షేమ విభాగ గ్రూప్ డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరిం చారు. బాధ్యతలు స్వీకరించడానికి ముందు సీఆర్‌డీఏలోని ముఖ్య అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం, సీఆర్‌డీఏ సిబ్బంది రాములు ను చాంబర్‌లో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు. అమరావతి రైతులు, వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం, రాజధానిలోని ఇతర వృత్తి పనివారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా రాములు పేర్కొన్నారు. అమరావతి ప్రాంత వాసుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, యువత, మహిళలకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన చెప్పారు.

స్థానిక సంస్థలకు మొండిచేయి!

(7వ పేజీ తరువాయి)

పరిషత్‌లకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఇక పట్టణ పరిధిలో ఆస్తుల క్రయవిక్రయాల సర్‌చార్జి మొత్తం మునిసిపాలిటీ ఖాతాకే జమ చేస్తారు. ఒక్క నరసరావుపేట మునిసిపాలిటీకి ఏడాదిగా సర్‌చార్జి నిధులు రూ.7 కోట్లు విడుదల కావాల్సి ఉంది.

నిధుల లేమితో..కునారిల్లుతున్నాయి

నిధుల లేమితో కొన్ని మునిసిపాల్టీల్లో జీతాలు సకాలంలో చెల్లించలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రేషన్ సర్‌చార్జికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ఖాజానాకు పంపించకుండా రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఆదేశించినట్లు సమాచారం. మళ్లీ ఆదేశాలు ఇచ్చే వరకు ప్రొసీడింగ్స్ నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్‌చార్జి నిధుల కోసం స్థానిక పాలక వర్గాలు, అధికారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నిధులు జమ కావాలంటే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. ప్రభుత్వ అదేశాల వస్తే ప్రొసీడింగ్స్‌ను పంపుతామని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎప్పటికి కరుణిస్తుందోనని సదరు పాలక వర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

మాస్టర్ ప్లాన్ తయారీపై సమావేశం

సత్తెనపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్, విజన్ డాక్యుమెంటరీ తయారీపై శనివారం పురపాలక సంఘ కార్యాలయం లో ఏపీసీఆర్‌డీఏ అధికారి మహాలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం నిర్వ హించారు. ప్రజల నుంచి, వివిధ సంస్థల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. కార్యక్రమంలో బిల్డర్లు, ఎల్‌టీపీలు, పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● **అచ్చంపేట** : మండలంలోని చిగురుపాడులో శనివారం ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.పద్మ తెలిపారు. కార్యక్రమంలో సమన్వయ చర్చలు, డిజిటలీకరణ తదితర అంశాలపై వివరించారు. తల్లులు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● **అచ్చంపేట:** మండలంలోని పత్తి పంటను మండల వ్యవసాయాధికారి పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు అందించారు.

● **మాచర్ల రూరల్** : పట్టణంలోని రెండో వార్డుకు చెందిన రాగిడి వెంకట్రావమ్మ బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఆర్యవైశ్య నేత కట్టమూరి సతీష్ సహకారంతో జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు, జనసేన నేతలు రూ.10 వేల ఆర్థికసాయాన్ని వెంకట్రావమ్మ కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ షరీఫ్, బార్లపూడి మల్లికార్జునరావు, మండి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

● **రెంటచింతల** : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గోలి పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. రెంటచింతలలోని ఆనందపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవంలో ఆయన మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. అంగన్వాడీలకు అందచేస్తున్న గ్రుడ్లు,పాలు, కిట్స్‌లను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతి, ప్రశాంతి, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి** : మండలంలోని డీడీ పాలెంనకు చెందిన పాటిబండ్ల పూర్ణయ్య, రాధికల మనువడు పాటి బండ్ల రియాన్స్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం పరివర్తన చెవిటి, మూగ పాఠశాలలకు రూ.15వేలు విలువైన ఫ్రిజ్‌ను అందించారు. కార్యక్రమంలో రియాన్స్ తల్లిదండ్రులు రాజా, ఈశ్వరి, కోమటినేని శ్రీనివాసరావు, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

● **మాచవరం** : ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చునని వైద్యాధికారి అన్వేష్ సూచించారు. మండలంలోని వేమవరం ప్రాథమిక పాఠశాలలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ కార్యక్రమంలో మాచవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం పరీక్షలు నిర్వహించి ముఖ్యంగా మందులు పంపిణీ చేశారు. కూటమి నేతలు గోళ్ళ గంగాధర్, జనసేన మండల అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు బీజేపీ మండల అధ్యక్షుడు పెరుగు రామయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● **క్రోసూరు** : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని క్రోసూరు ఏడీఏ పీ.మస్తానమ్మ అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ క్రోసూరు మండలంలో 12,227 ఎకరాల పత్తి పంటను వేసినట్టు తెలిపారు. పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

● **అచ్చంపేట** : అచ్చంపేటలోని చామర్రులో శనివారం చామర్రు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గోశాలకు అనుబంధంగా గో ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ అమల కుమారి ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, రైతులు గోవిందరెడ్డి, అనీల్‌కుమార్, వెంకట శివరావు, రాహూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● **నకరికల్లు** : నకరికల్లు విద్యుత్ ఏఈగా ముప్పాళ్ళ ఏఈ సీ సుచరితకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఏఈగా నియమించినట్టు ఏడీఈ బీ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన గౌస్‌ను మాచర్లకు బదిలీ చేసినట్టు చెప్పారు.

● నకరికల్లు : దీర్ఘకాళికంగా విద్యుత్ బకాయిలు ఉన్న వినియోగదారులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వెంటనే విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఏడీఈ బీ.వెంకటేశ్వరరెడ్డి కోరారు. శనివారం మండలంలోని కుంకలగుంట, గుండ్లపల్లి, నకరికల్లుతో పాటు వివిధ గ్రామాల్లో అధికారులు బృందాలుగా ఏర్పడి విద్యుత్ బిల్లులను వసూలు చేశారు. బకాయిలు చెల్లించకుండా విద్యుత్ వినియో గిస్తున్న వినియోగదారుల సరఫరాను నిలిపివేశారు.


● **గురజాలటౌన్** : ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఈనెల 16న మాచవరం మండలం, 17వ తేదీన గురజాలలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలలో 13 అర్జీలను పరిష్కరించినట్లు ఆర్డీవో మురళీకృష్ణ శనివారం తెలిపారు. వీటిలో మాచవరం మండలానికి సంబంధించి 9, గురజాలకు సంబంధించి 4 అర్జీలను పరిష్కరించామన్నారు. మాచవరం మండలానికి సంబంధించి మొత్తం 83, గురజాల మండలానికి సంబంధించి 89 అర్జీలు అందాయన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు కట్టవచ్చు


దాచేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారు లు తమ బకాయిలను ఆదివారం కూడా చెల్లించవచ్చని అసిస్టెంట్ ఎకౌంట్ అధికారి సందీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన తెలియజేస్తూ పిడుగురాళ్ళ, దాచేపల్లిలో విద్యుత్ కార్యాలయా ల వద్ద బిల్లులు చెల్లించే కౌంటర్లు పని చేస్తాయని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ బిల్లులు వసూళ్లకు సిబ్బంది వస్తారని, పాత బకాయిలు, ప్రస్తుత బకాయిలు చెల్లించాలని కోరారు.

పాహిమాం.. పరాశక్తి

● వైభవంగా దేవీ నవరాత్రులు
● కనువిందు చేస్తున్న అమ్మవారి అలంకారాలు


పిడుగురాళ్ల కనకదుర్గ దేవాలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు


మాచర్లలో ధనలక్ష్మీదేవి అలంకరణలో శ్రీ వాసవీ అమ్మవారు


సత్తెనపల్లిలో సరస్వతి దేవిగా అమ్మవారు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని వాసవీ అమ్మవారి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి గా, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా, కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాల యంలో శ్రీరామావతారం అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. నాగులగుడి, బ్రహ్మంగారి దేవాలయం, గంగమ్మతల్లి, షిరిడీ సాయి మందిర్, భగవాన్ సత్యసాయి దేవాలయం, శివాలయం, గుత్తికొండబిళంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● మాచవరం : మండలంలోని చెన్నాయపాలెంలోని రేణుకా అమ్మవారిని లలితా దేవిగా, మాచవరంలోని శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని లలిత త్రిపుర సుందరిగా ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ అమ్మవారిని నారాయణీదేవిగా అలంకరించారు.

● అచ్చంపేట: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని రాజ రాజేశ్వరిగా అలంకరించారు. మాదిపాడు వద్ద ఉన్న వేద పాఠశాల శారదాంబ ఆలయం లో లలిత త్రిపుర సుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

● క్రోసూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● బెల్లంకొండ: శ్రీమహాలక్ష్మిదేవి ఆలయంలో లలిత పరమేశ్వరీదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు.

● మాచర్ల రూరల్: పట్టణంలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

● కారంపూడి: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. రూ.40 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

● విజయపురిసౌత్: మెయిన్‌బజారులో గల కనకదుర్గ అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● దుర్గి: ముటుకూరు రోడ్డులో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● రెంటచింతల: శ్రీవాసవీ మాత, జంక్షన్ దుర్గాదేవి సంతానలక్ష్మిగా, సత్రశాల భ్రమరాంబ మహాచండీదేవిగా, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీచౌడేశ్వరీ కౌమారి దేవిగా అలంకరించారు.

● సత్తెనపల్లి: పట్టణంలో శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. వెంకటపతి కాలనీలో నీలంపాటి లక్ష్మీ అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

● రాజుపాలెం : మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహించారు. రాజుపాలెంలో శ్రీఅంకమ్మతల్లి లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

● నకరికల్లు: మహాకాళీ అలంకారంలో నరసింగపాడులోని గంగా అన్నపూర్ణాదేవి, మహంకాళి అలంకారంలో కుంకలగుంటలో భద్రకాళి అమ్మవారు, గజలక్ష్మి అలంకారంలో చేజర్లలో గంగా భ్రమరాంబ పార్వతి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అమరావతిలో ప్రపంచ పర్యాటక దినోత్సవం


పర్యాటక దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న అధికారులు

అమరావతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినో త్సవం పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో టూరిజం వాక్, స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. పర్యాటకులకు పర్యాటక దినో త్సవ విశేషాలను టూరిజం అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో పార్వతీ, టూరిజం జిల్లా అధికారి నాయుడమ్మ, అమరావతి టూరిజం శాఖ మేనేజర్ మణికుమార్, ఎంఈవో శివబాబు, ఆర్ఐ శిరోమణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవంపై అధికారుల నిర్లక్ష్యం

విజయపురిసౌత్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్, ఎత్తిపోతల, హరిత రిసార్ట్‌లో శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను అధికారులు నిర్వహించకపోవడంపై పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు పర్యాటక దినోత్సవం రోజున నాగార్జున కొండకు వెళ్లే పర్యాటకులకు లాంచీ టికెట్‌తోపాటు హరిత రిసార్ట్ రూమ్స్‌కు 10 శాతం డిస్కౌంట్ ఇచ్చేవారు. శనివారం పర్యాటక దినోత్సవం సందర్భంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకుండా పర్యాటకులకు టికెట్‌పై డిస్కౌంట్‌ను కూడా ప్రకటించకపోవడంపై అధికారుల తీరుపై పర్యాటకులు మండిపడుతున్నారు.

ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్తగా మారాలి : కమిషనర్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కుటుంబం.. ఒక వ్యాపారవేత్తను తయారు చేసే విధంగా తగు రుణ సదుపాయాలు కల్పిస్తుందని కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపా రు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో లోక్‌కల్యాణ మేళాను నిర్వహించారు. వీధి వ్యాపారులకు రుణాన్ని పంపిణీ చేయడం సులభ తరం చేస్తారని, ప్రతి బ్యాంకు నుంచి రుణాన్ని మంజూరు చేయడం తో పాటు తిరిగి చెల్లించిన వారికి రెట్టింపు రుణసౌకర్యాన్ని కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వీధి విక్రయదారులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యశిబిరం నిర్వహించారు. లోక్‌కల్యాణ్ మేళా పోస్టర్లను అధికారులు, కూటమి నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులుతో పాటు పిల్లి చెన్నారావు, పాండు రంగ శ్రీను, సయ్యద్ అమీర్‌అలి, కాంతారావు, జెమిని రామకృష్ణ, బిజిలి వెంకటరా వు, మెప్మా అధికారులు శ్రీనివాస్, రాయల్, తదితరులు పాల్గొన్నారు.


లోక్‌కల్యాణ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, కూటమి నేతలు పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, మెప్మా అధికారులు

సకాలంలో యూరియా సరఫరా చేసిన ఘనత కూటమిదే

● మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాండ్రు కాశయ్య

క్రోసూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాండ్రు కాశయ్య అన్నారు. శనివారం క్రోసూ రులోని రైతు సేవాకేంద్రం వద్ద నాలుగు వందల బస్తాల యూరియా ను ఉద్యోగులతో కలిసి టీడీపీ నాయకులు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ యూరియా సమస్య మన రాష్ట్రం లో మాత్రమే కాదని, దేశం మొత్తం ఉందని, ఐనా ప్రతిపక్ష పార్టీ రాజ కీయం చేయాలని చూసిందని విమర్శించారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ అవసరమైనంత మేరకే యూరి యాను వినియోగించుకోవాలని, ఎక్కువ వాడితే దుష్ప్రభావా లు సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శ్రీని వాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, చెరువు నీటి సంఘం అధ్యక్షులు పరిశ రాంబాబు, దారెడ్ల సీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్, డిజిటల్ బుక్ కాదు సుపరిపాలన అవసరం

● డాక్టర్ రామచంద్రారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

మాచర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న రెడ్‌బుక్, డిజిటల్ బుక్‌లు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని, ప్రజలకు కావాల్సింది సుపరిపాలన అని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 11 ఏళ్లుగా అరాచక, అబద్ధాల ప్రభుత్వాలను ప్రజలు తీవ్ర అసహనంతో చూస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలకు, శాంతి భద్రతలకు, సుపరిపాలనకు ఆమోదయోగ్యమైనది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ సమావేశంలో కొమ్ము కోటేశ్వరరావు, వంగపాటి నాగరాజు, రాజారావు, దొడ్డ శ్రీనివాసరావు, నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

దాచేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయ తీ సమావేశం సోమవారం ఉదయం 10:30 గంటలకు దాచేపల్లి 1వ సచివాలయంలో జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని వివరించారు. సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

మాచర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు 10 కంపెనీలు ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు జరిపారు. 178 మంది నిరుద్యోగులు హాజరుకాగా 71మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో జాబ్‌మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు. యువత ఉన్నత శిఖరాలను అందుకునేలా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ఎం రవీంద్రనాయక్, వీరాంజనేయులు, అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యచౌదరిని పరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే


వెంకయ్యచౌదరిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ తదితరులు

విజయపురిసౌత్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి తండ్రి చలమయ్య గత బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖపట్నం ఈస్ట్ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ శనివారం మాచర్ల మండలం బెల్లంకొండవారిపాలెంలోని వెంకయ్యచౌదరి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అలాగే ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీటీడీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సౌరబ్‌బోరా, సీఎం రాజేష్, బీవీఎస్ రాజు, పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య తదితరులు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, గుండాల శ్రీను, డీలర్ వెంకటేశ్వర్లు, గంటా ధనుంజయరావు పాల్గొన్నారు.

జీఎస్‌టీ ప్రయోజనాలు ప్రజలకు చేరువ కావాలి

దాచేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీఎస్‌టీ ప్రయోజనాలు ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని మండల స్థాయి అవగాహన సమావేశంలో నిర్వహించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమావేశం నిర్వహించారు. సామాన్యుడికి ఉప యోగపడే విధంగా తీసుకువచ్చిన జీఎస్‌టీ సంస్కరణలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో డీఎల్‌డీవో గబ్రూనాయక్, తహసీ ల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, జీఎస్‌టీ అధికారి పాల్గొన్నారు.

రూ.2 లక్షల చెక్కు అందజేత

అచ్చంపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : తెలు గుదేశం పార్టీ కస్తల గ్రామ అధ్యక్షుడు గుడేటి ఇజ్రాయేలు ఉపాధి హామీ పనికి వెళ్లి మృతి చెందాడు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కలుగ చేసుకొని ఇజ్రాయేలు కుటుం బానికి తక్షణమే బీమా సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇజ్రాయేలు భార్య మేరమ్మకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియో చెక్కును డీఎల్‌డీవో రాజ గోపాల్, ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం చేతుల మీదుగా అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తల గ్రామ అధ్యక్షుడు కొర్లకుంట శ్రీధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాయిడి సాంబశివుడు, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, ఎనిగండ్ల కోటయ్య, గంధం కోటేశ్వరరావు, బోదెల సాంబిరెడ్డి, కోట చంటి తది తరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో జాబు సాధించిన వారికి సన్మానం

సత్తెనపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రఘురామ్ నగర్‌కు చెందిన నాగినేని ప్రవీణ్ కుమార్, నాగినేని కిషోర్ కుమార్‌లు, దగ్గు ఉషాలు ముగ్గురు డీఎస్సీలో మంచి ర్యాంకులు సాధించి టీచర్ ఉద్యోగాలు పొందిన సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శని వారం ఘనంగా సన్మానించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు టీచర్ ఉద్యోగాలు సాధించటం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘ నేతలు అన్నారు. కార్యక్రమంలో కొత్త రామకృష్ణ, ఏఏ బాల సుబ్రహ్మణ్యం, బీ కాశీ విశ్వనాథం తదితరులు ఉన్నారు.

శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు

మాచవరం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాయ పాలెంలో సేవాలాల్ మేరమ దుర్గా భవానీ దేవాలయానికి తిరుమల తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పది లక్షలతో సేవాలాల్ దేవాలయానికి రాతి సింహ ద్వారాలు శనివా రం ఏర్పాటు చేశారు. గ్రామ పురోహితులు జానపాటి సీతారామ శర్మ పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పది లక్షల రూపాయల నిధులను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివా సరావు ద్వారా తిరుమల తిరుపతి శ్రీవాణి ట్రస్ట్ వారు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో సుగాలి పెద్దలు, గ్రామ పంచాయతీ ఇన్ చార్జ్ బొగ్గవరపు అంజయ్య, సొసైటీ పర్సన్ భూక్యా కోటేశ్వరనాయక్, బాణావత్ గోవిందునాయక్, బద్రి నాయక్, బాలాజీ నాయక్, శ్రీరామ్ నాయక్, సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శింగమనేని రూపవతికి అభినందనలు

ముప్పాళ్ళ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ ఈపీవోఆర్డీ, డిప్యూటీ ఎంపీడీవో శింగమనేని రూపవతి ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. ఆమెను కృష్ణాజిల్లా వేరులపాలెం మండలంలో ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించింది. రూపవతిని శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, ఎంపీడీవో రత్నం పలువురు అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు.

నల్లబర్లి పొగాకు సాగు వంద శాతం నిషేధం

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లి పొగాకు సాగును నిషేధిస్తూ ప్రభుత్వం ఈనెల 22న జీవో నెంబరు 740ను జారీ చేసిందని మం డల వ్యవసాయశాఖ అధికారి బీ.సుబ్బారెడ్డి అన్నారు. ఈ పొగాకు సాగు నిషే ధంపై మండలంలోని లక్కరాజు గార్లపాడులో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకవేళ పొగాకు ఎవరైనా సాగు చేసినా, నారు పెం చినా దాన్ని దున్నివేస్తామన్నారు. తెల్లబర్లి పొగాకు సాగు చేసే రైతులు ఆయా సంస్థల నుంచి అగ్రిమెంట్లు బాండ్లు పొంది ఆ నకలు కాపీ ని మండల వ్యవసా యశాఖ అధికారికి అందజేయాలన్నారు. రబీలో రైతులు మొక్కజొన్న, పెసర, మినుము, చిరు ధాన్యాలను సాగు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ చక్రవర్తి, పోలీసు, ఆరోగ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామాపురం కాలనీని తాకిన మూసీ నది వరద

● ఇళ్లు ఖాళీ చేస్తున్న పల్లె కారులు

దాచేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదికి మూసీ నది వరద నీరు కలవడం తో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాల ను ముంచెత్తుతూ పరుగులు తీస్తుంది. దాచేపల్లి మండలం రామాపురం గ్రామ సమీపంలోని నది ఒడ్డున ఉన్న పల్లెకారుల కాలనీలోకి కృష్ణానది నీరు చేరుకుంటుంది. ముందస్తు భద్రతలో భాగంగా కాలనీవాసులను ఇళ్ళ నుంచి ఖాళీ చేయిస్తున్నారు. అధికారులు పల్లెకారులను అప్రమత్తం చేసి గ్రామంలోని ఉన్నత పాఠశాలలోకి తరలిస్తున్నారు. కృష్ణానది ప్రవాహం గంట గంటకు పెరగడంతో ఏ సమయంలోనైనా నది ఒడ్డున ఉన్న పల్లె కారుల నివాస గృహాల్లోకి నది నీరు చేరవచ్చన్న భయాందోళన నెలకొంది. దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, పోలీస్ అధికారులు, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కూటమి నేతలు వేముల వినోద్ రెడ్డి తదితర అధికారులు సహకరిస్తున్నారు. మూసీ నది నీరు కృష్ణానదిలో కలవడంతో ప్రమాదం పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

భువనచంద్ర చెక్ డ్యామ్ పెండింగ్ పనులు పూర్తిచేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం మండలంలో భువన చంద్ర చెక్ డ్యామ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ఆ ప్రాంత ప్రజలకు సాగు, తాగు నీరు అందేలా చూడాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ శనివారం అసెంబ్లీలో సంబంధిత మంత్రిని కోరారు. ఆయన మాట్లాడుతూ భువనచంద్ర చెక్ డ్యామ్ పూర్తయితే మూడు మండలాల పరిధిలోని ఆరు గ్రామాలకు మేలు జరుగు తుందని, 91వేల ఎకరాలకు ఉపయోగ పడుతుందన్నారు. చెక్ డ్యామ్‌కు సంబంధించిన కెనాల్, ల్యాండ్ ఎక్విజేషన్ పనులు పూర్తి చేసి సాగు, తాగు నీరు ఆరు గ్రామాలకు ప్రజలకు అందేలా చూడాలని కోరారు. చెక్ డ్యామ్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించి పనులు పూర్తి చేయించాలన్నారు. నకరికల్లు మండలం చేజర్లలో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల కాంట్రాక్టర్ 60శాతం పనులు మాత్రమే పూర్తి చేశా రని, బిల్లులు వెంటనే చెల్లించి చెక్ డ్యామ్‌ను పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా చూడాలని అసెంబ్లీలో కన్నా మంత్రిని కోరారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచింతల డ్యామ్‌కు వరదనీరు పెరు గుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని పెదకూరపాడు క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుంచి దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ఆరు లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరే అవకాశం ఉందని, ఎగువ నుంచి వస్తున్న వరద నీటి ని పులిచింతల నుంచి దిగువకు పంపుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై దిగువ లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని, ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ప్రవీణ్ హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

● క్షయ, కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ


వైద్యుడు పాల్ రవితో మాట్లాడుతున్న డాక్టర్ మురళీకృష్ణ

రాజుపాలెం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రత్యేక చర్యలు తీసు కోవాలని జిల్లా క్షయ, కుష్ఠు నివారణ అధదికారి డాక్టర్ మురళీకృష్ణ కోరారు. శనివారం మండలంలోని రాజుపాలెంలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన రావు, స్టాఫ్ నర్స్ చందన, ఫార్మాసిస్ట్ శివ, ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి సిబ్బంది ఉన్నారు.

లేబర్ కమిషనర్‌ను కలసిన శ్రీసిమెంట్ కార్మికులు

దాచేపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ.. యాజమాన్య చర్యలను వ్యతిరేకిస్తూ కార్మికులు నరసరావుపేటలోని లేబర్ కమిషనర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. శనివారం ఫ్యాక్టరీ కార్మికులు మాట్లాడుతూ దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని శ్రీసిమెంట్ యాజమాన్యం స్థానికులను పనిలో నుంచి తొలగించి బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారికి పని కల్పిస్తుందని తెలిపారు. అక్టోబరు 6వ తేదీన ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని, కార్మికులను పిలిచి చర్చలు జరిపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. గద్దల వేదమణి, ముత్తయ్య, ప్యూజన్, శ్రీపతి ఏసోబు తదితరులు ఉన్నారు.

గో ఉత్పత్తులతో పర్యావరణ పరిరక్షణ

● ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి


గోశాలను సందర్శించిన ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ అమల కుమారి

క్రోసూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గో ఉత్పత్తులతో పర్యావరణం పరిరక్షించబడుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అన్నారు. శనివారం ఆమె క్రోసూరులో విలేకరులతో మాట్లాడారు. ఆధునిక వ్యవసాయంలో అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి సారాన్ని పెంపొందించ గల నిజమైన ఎరువులు మన ఇంటి గోమాత ద్వారానే లభిస్తాయని అన్నారు.

నేడు శ్రీఅనుగురాజు యాదవ్ విగ్రహావిష్కరణ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అఖండ పల్నాడు రాజ్య వ్యవస్థాపకుడు శ్రీఅనుగురాజు యాదవ్ చరిత్రను భావితరాలకు తెలియజేసేలా విగ్రహాన్ని నేడు ఆవిష్కరించనున్నట్లు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. గంగమ్మతల్లి దేవాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 11వ శతాబ్దంలో పల్నాడు రాజ్యాన్ని స్థాపించిన అనుగురాజు విగ్రహాన్ని నెలకొల్పడమే కాకుండా గామాలపాడులో పల్నాడు చరిత్రకు సంబంధించిన వీరులతో మ్యూజియంను ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నామని జంగా కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే శ్రీ అనుగురాజు యాదవ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి పార్థసారథి, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, యాదవ సంఘ ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు.

సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి


సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి


సత్తెనపల్లి సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి వి. విజయకుమార్ రెడ్డి శనివారం సాయంత్రం సందర్శించారు. జైలులోని పరిసరాలను పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఒక్కొక్కరు ఎన్ని రోజుల నుండి జైల్లో ఉంటున్నారని ప్రశ్నించారు. న్యాయవాదులను పెట్టుకోలేని వారికి ఉచితంగా న్యాయ సాయం అందిస్తామన్నారు. ఆయనతో పాటు సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం ఉన్నారు.

సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల




విజయపురిసౌత్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు శనివారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.30 అడుగులుగా ఉంది. ఇది 305.68 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, 26 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 3,76,402 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్ ఫ్లో వాటర్‌గా 4,19,598 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 4,19,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 3,93,615 క్యూసెక్కుల నీటి విడుదల



రెంటచింతల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు శనివారం 3,93,615 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, సాయి నిరంజన్ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి ప్రాజెక్టుకు 3,92,999 క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. రిజర్వాయర్‌లో 74.73 మీటర్ల మేర నీరుండగా ఇది 6.560 టీఎంసీలకు సమానమని చెప్పారు. భారీ వరద కారణంగా ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు.



ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని భారీగా విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 3,83,961 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీకి వచ్చి చేరుతోంది. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3,75,125 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. తూర్పు డెల్టా కాలువకు 4,323 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి కొనసాగుతుండడంతో దిగువ నది తీర ప్రాంత వాసులు, లంక భూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

వాహన విక్రయదారుల్లో.. దసరా జోష్

● పండుగ ఆఫర్లు, జీఎస్టీ తగ్గింపుతో ఊపందుకున్న కొనుగోళ్లు
● ఏడు రెట్లు పెరిగిన బైక్ అమ్మకాలు ● రూ.లక్ష వరకు తగ్గిన కార్ల ధరలు


గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ రాగానే మార్కెట్లు రద్దీగా మారుతాయి. ముఖ్యంగా వాహనాల అమ్మకాలు పెరగటం ప్రతి ఏటా కనిపిస్తుంది. ఈ సారి పండుగ ఆనందానికి తోడు జీఎస్టీ తగ్గింపు కూడా తోడైంది. పన్ను భారం తగ్గటంతో ప్రజలు కొత్త వాహనాల కొనుగోలుకు పోటెత్తుతున్నారు. ఫలితంగా జిల్లాలోని వాహనాల అమ్మకాలు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. షోరూమ్‌లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతున్నాయి.

● రికార్డుస్థాయిలో ద్విచక్రవాహనాల అమ్మకాలు

జిల్లాలో ద్విచక్రవాహనాల విక్రయాలు ఏడు రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. గుంటూరులోని టీవీఎస్ షోరూమ్‌లలో జీఎస్టీ తగ్గింపునకు ముందు రోజుకు 15-20 ద్విచక్రవాహనాలు అమ్ముడయ్యేవి. అయితే జీఎస్టీ అమల్లోకి వచ్చిన 22వ తేదీ తర్వాత రోజుకు 120 నుంచి 130 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి హీరో, హోండా, బజాజ్ షోరూమ్‌లలో కూడా కనిపిస్తోంది. ప్రధానంగా యూనికార్న్, పల్సర్ 150 సీసీ బైక్‌ల ధరలు రూ.10వేల వరకు తగ్గటంతో యువత వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు బైక్ కొనాలని అనుకున్నా ధరలు ఎక్కువగా ఉండటంతో వాయిదా వేసుకున్నామని, ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో పాటు దసరా ఆఫర్ కూడా కలుపుకొని తక్కువ ధరకు వస్తుండటంతో వెంటనే బుకింగ్ చేసేశాం అని పలువురు యువకులు చెబుతున్నారు.

● కార్ల అమ్మకాలకు ఊపిరి....

జీఎస్టీ తగ్గింపుతో కార్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి. కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గడంతో ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల వారు కొత్త కార్ల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. షోరూమ్‌లు జీఎస్టీకి ముందు, తరువాత ధరల వ్యత్యాసాలను ప్రత్యేక బోర్డులపై ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. కస్టమర్లకు ధరల తగ్గింపును స్పష్టంగా తెలియజేసేందుకు ప్రత్యేకంగా డిస్‌ప్లే బోర్డులు డీలర్లు ఏర్పాటు చేస్తున్నారు. జీఎస్టీ సంస్కరణల ప్రభావాన్ని ప్రజలకు దగ్గర చేయటానికి ప్రచార రథాలను కూడా సిద్ధం చేశామని కారు షోరూమ్ నిర్వాహకులు తెలిపారు. అమ్మకాలు ఊహించని రీతిలో పెరగటంతో రవాణాశాఖ కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసింది. వాహన యజమానులకు ఎక్కువ సమయం వృథా కాకుండా డిజిటల్ పద్ధతులను వినియోగించి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నామని అధికారులు తెలిపారు.



షోరూమ్‌ల వద్ద పండుగ శోభ

● కొత్త కార్లు కొనలేని వారికి అందుబాటులోకి పాత కార్లు

జీఎస్టీ తగ్గింపుతో కొత్త కార్ల ధరలు దిగిరావటంతో ఇప్పటి వరకు పాత కార్లకు ఉన్న రేటు మరింతగా పడిపోయింది. ఇప్పటి వ రకు కొనాలనే ఆలోచన లేని వారు కూడా తమ కారు మోజు తీర్చుకునేందుకు పాత వాటిని కొనేందుకు ముందుకొస్తున్నారు. దీంతో ప్రస్తుతం కొత్త-పాత కార్ల మార్కెట్ జోరందుకుంది.

● ఐదు రోజుల్లోనే భారీ విక్రయాలు

కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత కేవలం ఐదు రోజుల్లోనే జిల్లాలో 1900 మోటార్ సైకిళ్ళు, 90 కార్లు, క్యాబ్‌లు, 10 ట్రాక్టర్‌లు, 67 ఆటోలు, 47 గూడ్స్ వాహనాలు, 15 ఆటో గూడ్స్ వాహనాలు, 12 ఇతర వాహనాలు రవాణాశాఖ గణాంకాల ప్రకారం అమ్ముడయ్యాయి. ఈ స్థాయిలో అమ్మకాలు జరగటం గతంలో ఎప్పుడూ చూడలేదని అధికారులు చెబుతున్నారు.

అమ్మకాలు బాగా పెరిగాయి

- జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి



జిల్లాలో వాహనాల అమ్మకాలు దాదాపు ఐదు నుంచి ఏడు రెట్లు పెరిగాయి. ముఖ్యంగా కార్ల ధరలు రూ. లక్ష వరకు తగ్గటంతో వాటిపై కొను గోలుదారులు ఆసక్తి చూపుతున్నారు. జీఎస్టీకి ముందు ఆ తరువాత ధరల వ్యత్యాసాలను తెలిపే బోర్డులను షోరూమ్ వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. అలాగే ప్రచార రథాలను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

ఉద్యమాల పురిటి గడ్డ పల్నాడు

● పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రాభవాన్ని వివరించిన కలెక్టర్



కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటిగడ్డ, పౌరుషానికి ప్రతీక పల్నాడు అని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె పల్నాడు జిల్లా ప్రాభవాన్ని వివరించారు. ప్రపంచ పటంలో పల్నాడును ప్రత్యేక స్థానంలో నిలిపిన పల్నాటి నాయకులకు, కళాకారులకు, ప్రజలకు ప్రపంచ పర్యాటక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్నాడు ప్రాభవాన్ని గురించి వివరిస్తూ.. నకరికల్లు వరి ధాన్యం, లాలిపురం జామకాయలు, అడిగొప్పల రేగిపళ్ళు.. ఇలా ఎన్నో రకాల అంశాలకు పల్నాడు ప్రసిద్ధి అని చెప్పారు. తెలుగు భాష తొలి పదం "నాగబు" లిఖితరూపంలో అమరా వతిలోనే కనబడిందని, బౌద్ధ మత స్తూపాల, శిథిలాల, ప్రాచీన అవశేషాల, గ్రంథాలు సమాచారాన్ని అమరావతి మ్యూజియం తెలియజేస్తుందన్నారు. రెండో బుద్ధుడు ఇండియన్ ఐన్‌స్టీన్‌గా పేరుగాంచిన ఆచార్య నాగార్జునుడు తిరగాడిన నేల పల్నాడని అన్నారు. రెడ్డి రాజుల రాజధాని కొండవీడు గురించి, శ్రీ నాథ కవిసార్వభౌముడి గురించి వివరించారు. చేజర్ల కపోతేశ్వరాలయం, గుత్తికొండ బిలం గురించి తెలియజేశారు. చాపకుడు సిద్ధాంతం ద్వారా సామాజిక న్యాయం కోసం పల్నాటి బ్రహ్మానాయుడు నిలబడ్డారని, అలాగే మహిళా మంత్రి నాగమ్మ గురించి తెలియ జేశారు. కారంపూడి, కోటప్పకొండ, గురజాల, సొలస తదితర ప్రాంతాల గురించి వివరించారు. కోహినూర్ వజ్రాన్ని ప్రపంచానికి అందించిన బెల్లంకొండ మండలం కోళ్లూరు పల్నాడులోనే ఉందని, బ్రిటీష్ వారిపై కన్నెర్ర చేసి ప్రాణ త్యాగం చేసిన పుల్లరి ఉద్యమ కొదమసింహం కన్నె గంటి హనుమంతు, అలాగే మహాకవి గుర్రం జాషువా పల్నాడు ప్రాంతం వారేనని చెప్పారు. సుగంధ ద్రవ్యాలకు యడ్లపాడు ప్రసిద్ధని, పులిచింతల చింతలు తీర్చే అమృతవాహినని అన్నారు. అలాగే నరసరావుపేటలోని రాజు గారి కోట, నిదానంపాటి అమ్మవారు కొలువైన అడిగొప్పల గు రించి వివరించారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం జన్మస్థలం ఇరుకుపాలెం అని, తెలుగు తమిళ, కన్నడ భాషలలో ప్రసిద్ధి గాంచిన గాయకుడు మనో పల్నాడు వాడేనని చెప్పడం గర్వంగా ఉం దని చెప్పారు. దేశంలో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు నాగార్జున సాగర్ పల్నాడులోనే ఉందని, అతిపెద్ద పులుల అభయారణ్యం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టని చెప్పారు. వేలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న స్పిన్నింగ్ మిల్లులు, ఎక్కువ సిమెంట్ ఫ్యాక్టరీలు పల్నాడులోనే ఉన్నాయని కృతికా శుక్లా తెలియజేశారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగుళూరుకు చెందిన తండ్రీ కుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో జంట హత్యలకు పాల్పడిన కేసులో 12వ నిందితుడైన సంతమాగులూరుకు చెందిన గడ్డం ప్రభాకర్ రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు వారు చెప్పారు. ఈ కేసులో మొత్తం 13 మందిని నిందితులుగా ఉన్నారని, వీరిలో ఇప్పటివరకు 11 మందిని అరెస్టు చేశామని తెలిపారు. మరో ఇరువురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

గోవుల అక్రమ తరలింపును అడ్డుకున్న గో- పరివార్

● తాడేపల్లి పోలీసులకు అప్పగింత

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను హైదరాబాద్ కబేళాకు తరలిస్తున్న లారీని గో- పరివార్ సంస్థ ప్రతినిధులు శనివారం అడ్డుకున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి కనకదుర్గమ్మ వారధి వద్ద లారీని అడ్డుకున్న గో- పరివార్ రాష్ట్ర అధ్యక్షుడు తోట సురేష్‌బాబు పోలీసులకు సమా చారం అందించారు. పోలీ సు లు అక్కడకు చేరుకొని డ్రైవర్‌తోపాటు లారీని అదుపులోకి తీసుకున్నారు. గోవులను గోశా లకు తరలించారు. ఎటువంటి అనుమతి లేకుండా అక్రమం గా 52 గోవులను లారీలో కుక్కి తరలిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో గో- పరివార్ సురేష్ పేర్కొన్నారు.



గోవులను తరలిస్తుస్తున్న లారీ

బాపట్ల తీరంలో తొలి 5 స్టార్ రిసార్టు

● వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబునాయుడు



వర్చువల్‌గా బై ది బే రిసార్టును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రత్యేక గుర్తింపు రావడానికి రిసార్టులు ఎంతగానో దోహదం చేస్తాయని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో నూతనంగా నిర్మితమైన తొలి 5 స్టార్ గోల్డెన్‌శాండ్స్ బై ది బే రిసార్టును విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి సీఎం శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసార్టు విశేషాలను నిర్వాహకులు సీఎంకు వివరించారు. అత్యాధునిక 5 స్టార్ సదుపాయాలతో 147 గదులు, వెయ్యి మందికి పైగా సామర్థ్యం ఉండే లాన్, 400 మందికి అనువైన బ్యాంకెట్ హాల్‌తో 10.75 ఎకరాల విస్తీర్ణంలో ఈ 5 స్టార్ రిసార్ట్ నిర్మితమైనట్లు నిర్వాహకులు సీఎంకు తెలిపారు. దాదాపు రూ.150 కోట్ల ఖర్చుతో నిర్మాణం జరిగిందని, 700 మంది వరకు ఇక్కడ ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాగంటి ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యాగంటి దుర్గా ప్రసాద్‌రావు, రిసార్ట్ డైరెక్టర్ కన్యాదర రవీంద్రబాబు పాల్గొన్నారు. వర్చువల్ గా జరిగిన రిస్టార్ట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి. గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు

వీణా అవార్డ్సు నాటకోత్సవాల ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సాహిత్య సంస్థ కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ సంయుక్తంగా చేపట్టిన వీణా అవార్డ్స్ 2025 నాటకోత్సవాలు శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సభకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఆలపాటి మాట్లాడుతూ, కళా వైభవానికి తెనాలి కళాభిమానులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కళలకు, కళాకారులకు నిలయమైన తెనాలి పట్టణంలో ప్రతి ఏటా వారం రోజుల పాటు నాటకోత్సవాలను ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నిర్వహిస్తున్నారని చెప్పారు. నాటకోత్సవాలను రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కూచిపూడి కళాకారిణి వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో నాటక ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన మూడు నాటకాలు కళాభిమానులను అలరించాయి. కర్నూలు టీజీవీ కల్చరల్ అకాడమీ కళాకారులు శ్రీ వేంకటేశ్వర మహత్యం పద్య నాటకం ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచించిన నాటకానికి రమణారెడ్డి దర్శకత్వం వహించారు. అనంతపురం లలిత కళా పరిషత్ కళాకారులు కాలభైరవ సంహారం పద్యనాటకం ప్రదర్శించారు. పోతులయ్య రచించిన ఈ నాటకానికి శ్రీరామగోవిందసాగర్ దర్శకత్వం వహించారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ కళకారులు ప్రదర్శించిన నల్లత్రాచునీడలో సాంఘిక నాటకాన్ని పి.శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు. నాటిక నిర్వాహకులకు కమిటీ అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ ప్రదర్శన పారితోషికాలు అందజేశారు. కాగా, వీణా అవార్డ్స్ నాటకోత్సవాలతో రూపొందించిన విపంచి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డబుల్ హార్స్ సంస్థ ఎండీ మునగాల మోహన్‌శ్యాంప్రసాద్, నాటక రచయిత మృత్యుంజయరావు, రంగస్థల కళాకారుల సంఘ కార్య నిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



విపంచి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి, సాయిమాధవ్ తదితరులు

విద్యార్థిని మృతి కేసును సీబీఐకి అప్పగించండి

● గుంటూరు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని మృతి ఘటనకు సంబంధించి 2017లో గుంటూరు, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో దాఖలైన కేసు దర్యాప్తులో పురోగతి లేకపోవ డంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. విద్యార్థిని మృతి విషయంలో పోలీసులు పరస్పర విరు ద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడమే సముచితమని అభిప్రాయపడింది. సీబీకి ఆదేశాలు ఇచ్చే ముందు కేసు దర్యాప్తు పురోగతిపై వాస్తవాలు పేర్కొంటూ అఫిడవిట్ వేయాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించింది. కేసుపై తదుపరి విచారణను అక్టోబర్ 6కి వాయిదా వేసింది. గుంటూరు జిల్లా గోపాయపాలెంకు చెందిన గర్నెపూడి శ్రావణ సంధ్య (17) బుడంపాడులోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతూ 2017లో అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. శ్రావణ సంధ్య హాస్టల్‌లోని 4వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందిందని హాస్టల్ వార్డెన్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. ఈ ఘటనపై గుంటూరు జిల్లా, నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఆధారంగా పరిశీలిస్తే వసతి గృహం నాలుగో అంతస్తు నుంచి యువతి ప్రమాదవశాత్తు పడిపోయిందని, ఆ సమయంలో ఎవరూ లేరని పోలీసులు కోర్టు ముందు ఉంచిన వివరాలలో పేర్కొన్నారని గుర్తు చేసింది. అయితే తన కుమార్తెను హత్య చేశారని, పోలీసులు కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదని పేర్కొంటూ మృతురాలి తల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఘటనపై సీఐడీ లేదా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలిం చారు. విద్యార్థిని మృతి విషయంలో పరస్పర విరుద్ధ వివరాలను కోర్టు ముందు ఉంచడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

పెదకాకాని మల్లేశ్వరుని దర్శించిన మంత్రి సుభాష్

పెదకాకాని, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శిం చారు. ఆలయ అధికారులు, అర్చకస్వాములు, వేదపండితుల వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాలతో ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కుంకుమ పూజలు, రాహుకేతు పూజలలో మంత్రి పాల్గొన్నారు. ఆల య అర్చకులు, వేద పండితులు ఆయన్ను సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్ర పటాన్ని అందజేశారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమీషనర్ ఎస్ ఎస్. చంద్రేఖర అజాద్ దంపతులు శ్రీ స్వామి, అమ్మవార్లను శనివారం దర్శిం చుకున్నారు. ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామికి, భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు


పోలీసుల విచారణలో పిన్నెల్లి సోదరుల సమాధానం

మాచర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, గుండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు జవిశెట్టి సోదరుల జంట హత్య కేసులో నిందితులైన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలు శనివారం జరిగిన పోలీసుల విచారణలో మాకు తెలీదు.. గుర్తులేదు.. సంబంధం లేదు.. అనే సమాధానాలిచ్చారు. మాచర్ల సర్కిల్ కార్యాలయంలో విచారణ అధికారి మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, గురజాల డీఎస్పీ జగదీష్ సమక్షంలో పిన్నెల్లి సోదరులు హైకోర్టు న్యాయవాదులు మనోహర్‌రెడ్డి, రామలక్ష్మారెడ్డిలతో కలిసి విచారణకు హాజరయ్యారు. ఉదయం 10:30 గంటలకు సర్కిల్ కార్యాలయానికి చేరుకోగా రాత్రి 9 గంటల వరకు విచారణ కొనసాగింది. ముందుగా మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని విచారించారు. అనంతరం సాయంత్రం అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. ఇరువురు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులతో మాట్లాడినట్లు గుర్తించిన పోలీసులు దానిపై ప్రశ్నించినా ఆ ఫోన్లు మేము వాడలేదు.. ఎవరు వాడారో మాకు తెలీదు అంటూ సమాధానాలిచ్చారు. విచారణ అనంతరం పోలీసులు రాత్రి 9 గంటలకు పిన్నెల్లి సోదరులను సర్కిల్ కార్యాలయం నుంచి పంపించారు. పోలీసులు ఇచ్చిన నోటీసుల మేరకు విచారణ ముగిసినప్పటికీ ఈ కేసులో మరింత సమాచారం కోసం మరోసారి పిన్నెల్లి సోదరులను విచారణకు పిలిచే అవకాశం లేకపోలేదు.

రైల్వేట్రాక్ పెట్రోలింగ్ కట్టుదిట్టం

● నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం పెరగడంతో ఒక్కో టీంలో ముగ్గురు కార్మికులు
● సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక పరికరాలు

గుంటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో రైల్వే సిబ్బందికి విధులు నిర్వహించడమంటే కత్తి మీద సాములాంటిదే. సింగిల్ ట్రాక్ మాత్రమే ఉన్న ఈ ఘాట్ సెక్షన్‌లో వన్యప్రాణుల సంచారం అధికంగా ఉంటుంది. పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు వంటివి హఠాత్తుగా ట్రాక్ పైకి వచ్చేస్తుంటాయి. ఇటీవలకాలంలో రైలు ఢీకొని వన్యప్రాణులు మృతి చెందిన ఘటనలు కూడా చోటు చేసుకొన్నాయి. ఇదే సమయంలో ట్రాక్‌పై ముఖ్యంగా రాత్రి వేళ విధులు నిర్వహించే సిబ్బందికి ఆయా జంతువులు తారసపడ్డాయంటే ఇబ్బందికరమే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు డివిజనల్ రైల్వే అధికారులు ఒకరిద్దరిని కాకుండా రాత్రివేళ పెట్రోలింగ్ డ్యూటీలో ముగ్గురిని పంపాలని నిర్ణయించారు. దీని వల్ల సిబ్బంది భద్రత పెరుగుతుందని అధికారులు తెలిపారు. దిగువమెట్ట-చలమ మధ్యన 16 కిలోమీటర్ల రైలు మార్గం నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి ఏర్పాటై ఉంది. దీనిని మూడు విభాగాలుగా చేసి సిబ్బందికి డ్యూటీలు వేశారు. రాత్రి వేళ డ్యూటీకి వెళ్లే సిబ్బంది కచ్చితంగా రెట్రో రిఫ్లెక్ట్ జాకెట్లు ధరిస్తారు. అలానే జంతువులు కొంచెం దూరంలో కనిపించగానే డ్రమ్ములు, తంబూరాలు వాయిస్తారు. అలానే టపాసులు పేలుస్తారు. కాగడాలు వెలిగించడం వంటివి చేసి బెదరగొడతారు. ఉదయం షిఫ్టులో ఇద్దరు కార్మికులు విధులు నిర్వహిస్తారు. వీళ్లు కూడా ఆయా పరికరాలను కలిగివుంటారు.



నల్లమల అటవీ ప్రాంతంలో రైలుమార్గంపై రాత్రి వేళ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకే..

● రైల్వే ప్రజాసంబంధాల అధికారి

రైళ్ల రాకపోకలు సురక్షితంగా సాగేందుకు, ప్రయాణికుల భద్రతకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు రైల్వే ప్రజాసంబంధాల అధికారి డీ వినయ్‌కాంత్ తెలిపారు. వర్షాకాలంలో హఠాత్తుగా వాగులు పొంగి నీరు రైలుమార్గాలపైకి వచ్చేస్తుంటుంది.ఆ సమయంలో ట్రాక్ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. 24 గంటల పెట్రోలింగ్ డ్యూటీల వల్ల ఏదైనా సమస్య తలెత్తినా వెంటనే రైళ్లను నిలిపేసి మరమ్మతులు చేయించడానికి వీలు కలుగుతుందన్నారు. అలానే రాబోయే శీతాకాలంలో దట్టమైన పొగమంచు వల్ల కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు.



ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



ఉద్యమాల పురిటి గడ్డ పల్నాడు

● పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రాభవాన్ని వివరించిన కలెక్టర్


కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల పురిటిగడ్డ, పౌరుషానికి ప్రతీక పల్నాడు అని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఆమె పల్నాడు జిల్లా ప్రాభవాన్ని వివరించారు. ప్రపంచ పటంలో పల్నాడును ప్రత్యేక స్థానంలో నిలిపిన పల్నాటి నాయకులకు, కళాకారులకు, ప్రజలకు ప్రపంచ పర్యాటక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పల్నాడు ప్రాభవాన్ని గురించి వివరిస్తూ.. నకరికల్లు వరి ధాన్యం, లాలిపురం జామకాయలు, అడిగొప్పుల రేగి పళ్ళు. ఇలా ఎన్నో రకాల అంశాలకు పల్నాడు ప్రసిద్ధి అని చెప్పారు. తెలుగు భాష తొలి పదం "నాగబు" లిఖితరూపంలో అమరావతిలోనే కనబడిందని, బౌద్ధ మత స్థూపాల, శిథిలాల, ప్రాచీన అవశేషాల, గ్రంథాలు సమాచారాన్ని అమరావతి మ్యూజియం తెలియజేస్తుందని పేర్కొన్నారు. రెండో బుద్ధుడు ఇండియన్ ఐన్‌స్టీన్‌గా పేరుగాంచిన ఆచార్య నాగార్జునుడు తిరగాడిన నేల పల్నాడని అన్నారు. రెడ్డి రాజుల రాజధాని కొండవీడు గురించి, శ్రీ నాథ కవిసార్వభౌముడి గురించి వివరించారు. చేజర్ల కపోతేశ్వరాలయం, గుత్తికొండ బిలం గురించి తెలియజేశారు. చాపకుడు సిద్ధాంతం ద్వారా సామాజిక న్యాయం కోసం పల్నాటి బ్రహ్మనాయుడు నిలబడ్డారని, అలాగే మహిళా మంత్రి నాగమ్మ గురించి తెలియజేశారు. కారంపూడి, కోటప్పకొండ, గురజాల, సొలస తదితర ప్రాంతాల గురించి వివరించారు. కోహినూర్ వజ్రాన్ని ప్రపంచానికి అందించిన బెల్లంకొండ మండలం కోళ్లూరు పల్నాడులోనే ఉందని, బ్రిటిష్ వారిపై కన్నెర్ర చేసి ప్రాణ త్యాగం చేసిన పుల్లరి ఉద్యమ కొదమసింహం కన్నెగంటి హనుమంతు, అలాగే మహాకవి గుర్రం జాషువా పల్నాడు ప్రాంతం వారేనని చెప్పారు. సుగంధ ద్రవ్యాలకు యడ్లపాడు ప్రసిద్ధని, పులిచింతల చింతలు తీర్చే అమృతవాహినని అన్నారు. అలాగే నరసరావుపేటలోని రాజు గారి కోట, నిదానంపాటి అమ్మవారు కొలువైన అడిగొప్పుల గురించి వివరించారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం జన్మస్థలం ఇరుకుపాలెం అని, తెలుగు తమిళ, కన్నడ భాషలలో ప్రసిద్ధిగాంచిన గాయకుడు మనో పల్నాడు వాడేనని చెప్పడం గర్వంగా ఉందని చెప్పారు. దేశంలో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టు నాగార్జున సాగర్ పల్నాడులోనే ఉందని, అతిపెద్ద పులుల అభయారణ్యం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్టని చెప్పారు. వేలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న స్పిన్నింగ్ మిల్లులు, ఎక్కువ సిమెంట్ ఫ్యాక్టరీలు పల్నాడులోనే ఉన్నాయని కృతికా శుక్లా తెలియజేశారు.





అభివృద్ధి పథంలో ఉమ్మడివరం


ఉమ్మడివరం గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చేతి పంపును ప్రారంభిస్తున్న సర్పంచ్ వీరగంధం ఆనంద్ (ఫైల్)


సర్పంచ్ ఆనంద్

వినుకొండ: లక్షల్లో జీతాలు వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలను వదులుకొని గ్రామానికి మంచి చేయాలని సదుద్దేశంతో యువకులు రాజకీయాల్లోకి వస్తున్నారు. సీఎం చంద్రబాబు పిలుపుతో సమాజ సేవకు నడుంబిగిస్తున్నారు. దీనికి ఉదాహరణ వినుకొండ మండలంలోని ఉమ్మడివరం గ్రామం. గ్రామానికి చెందిన వీర గంధం ఆనంద్ కంప్యూటర్ ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వదులుకొని గత పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందారు. ఉమ్మడివరాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నాడు. మౌలిక వసతులైన.. తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించి.. గ్రామస్థుల మన్ననలను పొందుతున్నారు. రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను తీర్చిదిద్దారు. పంచాయతీ పరిధిలోని చెట్టుపల్లి గ్రామంలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశారు. రెండు గ్రామాల్లో 20 బోర్లు, గ్రావెల్ రోడ్లు పూర్తి చేసి, బెంచీలు ఏర్పాటు చేశారు. ఎస్టీ కాలనీలో చర్చిని ఏర్పాటు చేశారు. సొంత నిధులతో రెండు గ్రామాల్లో లో-వోల్టేజ్ సమస్య ఉండడంతో 3 ట్రాన్‌ఫార్మర్లు, 20 కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు సమస్య లేకుండా చేశారు. రెండు గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలిగేలా చర్యలు తీసుకున్నారు. బస్టాండ్ ఏర్పాటు చేయాలని, రెండు గ్రామాల్లో శ్మశానాలు అభివృద్ధి చేయాలని గ్రామాల్లో మురుగు లేకుండా.. పూర్తిస్థాయిలో సైడ్ కాల్వలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ వీరగంధం ఆనంద్ తెలిపారు.


(ఫైల్)
ఉమ్మడివరంలో విద్యుత్ స్తంభాలను ఏర్పటుచేస్తున్న సర్పంచ్ వీరగంధం ఆనంద్





గడ్డి మందు స్టాకు నిలుపుదల

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయ సంచాలకులు వి హనుమంతరావు నరసరావుపేట పట్టణంలోని పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పల్నాడు డైలీ ట్రాన్స్‌పోర్టులో ప్రభుత్వం నిషేధించబడిన గ్లైసిల్లు గడ్డి మందును నిల్వలను గుర్తించారు. రూ.1,46,700 విలువైన స్టాకు నిలుపుదల చేస్తూ యజమానికి ఆదేశాలు జారిచేశారు. గ్లైసిల్ కలుపు మందు జిల్లాలోని పురుగు మందులు డీలర్లు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓలు ఐ.శాంతి, శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు కె.బ్రహ్మయ్య, జి.శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు తనిఖీల్లో పాల్గొన్నారు.

అన్యాయం జరిగిన ప్రతి కార్యకర్తకు న్యాయం

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్యాయం జరిగిన ప్రతి వైసీపీ కార్యకర్తకు న్యాయం చేస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి విడుదల రజని, మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకర్రావు, సత్తెనపల్లి సమన్వయ కర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తల చేతిలో అన్యాయానికి గురైన పార్టీ నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయడానికి ఈ యాప్‌ను ఆవిష్కరించామన్నారు.



సీజనల్ వ్యాధులపై ఆరా

నాదెండ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో ఎం.పద్మావతి శనివారం సందర్శించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధుల గురించి ఆరా తీశారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా వ్యాధులు ప్రబలితే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారిణి డాక్టర్ సాయి శ్వేత, సీహెచ్‌వో ఎం సుబ్బారెడ్డి, భవానీ తదితరులు ఉన్నారు.



'ఆట్యా-పాట్యా'లో నేషనల్ మీట్‌కు వాగ్దేవి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25, 26న నిర్వహించిన ఆట్యాపాట్యా స్టేట్ మీట్‌లో పల్నాడు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. జిల్లా జట్టుకు తమ కళాశాల విద్యార్థులు ఆరుగురు ప్రాతినిధ్యం వహించారన్నారు. కర్ణాటకలో జరిగే నేషనల్ మీట్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. బాలికల విభాగంలో పసుపులేటి తిరుపతమ్మ, పిన్నెబోయిన స్రవంతి, బోరుగడ్డ సౌజన్య, షేక్ నజ్మా, బాలుర విభాగంలో కాసా శ్రీనివాసరావు, ధనవరపు త్రినాథ్ ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్‌లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, వీపీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.



ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు


పూజలు చేస్తున్న రామారావు దంపతులు

బొల్లాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఘనంగా నవరాత్రుల ఉత్సవాలు జరుగుతున్నాయి. వెల్లటూరులోని సంతాన వేణుగోపాల స్వామి, శివాలయంలో పార్వతి అమ్మవారికి బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరణ చేశారు. కజ్జాయం రామారావు దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, బహుమతులను అందజేశారు.



శాసనసభను గౌరవసభగా ఎమ్మెల్సీలు అందరూ భావించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాసనసభను గౌరవ సభగా ఎమ్మెల్సీలు అందరూ భావించాలని, అలాంటి సభలో వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభలో వైసీపీ నాయకులు ఏ విధంగా మాట్లాడుతున్నారో, ఏవిధంగా పరుష పదజాలం ఉపయోగిస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. అహంకారంతో సాక్షాత్తు ముఖ్యమంత్రిని కూడా సాధారణ ఎమ్మెల్యేగా సంబోధించడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రిని ఏకవచనంతో సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, కొక్కిరాల శ్రీనివాసరావు, కూరపాటి హనుమంతురావు, కొల్లి ఆంజనేయులు, కిషోర్, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

● మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం అని మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో చాంబర్ ఆఫ్ కామర్స్, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ప్లాస్టిక్ అసోసియేషన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలో 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు మార్గ నిర్దేశికత్వంలో నిషేధించబడిన 19 రకాల వస్తువులను పట్టణంలో కూడా నిషేధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కరపత్ర రూపంలో, ఫోటోల ద్వారా ప్రత్యామ్నాయ వస్తువులు, బయో ప్లాస్టిక్ కవర్లు ఇతరత్రా వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై తహసీల్దారుకు ఫిర్యాదు

ఈపూరు,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుమెళ్ల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబరు 504-1,4,15లో సుమారు 90 ఎకరాలు ఆక్రమించుకొని మొక్కలు వేస్తున్నారని గ్రామస్థులు శనివారం తహసీల్దారు ఎ.నశినికి శనివారం ఫిర్యాదు పత్రం అందజేశారు. సుమారు 382 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా దాదాపు అంతా ఆక్రమణలో ఉందని పేర్కొన్నారు. ఉందన్నారు. ఆక్రమణలు తొలగించి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. దీనిపై విచారించి ఆక్రమణలను తొలగిస్తానని తహసీల్దారు గ్రామస్థులు తెలిపారు. వైసీపీ నాయకులు వెంకట హనుమయ్య, గుర్రం వీరాంజినేయులు,పిచ్చారావు, ముప్పారాంబాబు, అనిల్, టి.రామకోటేశ్వరరావు, ఆంజినేయులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ ఆనందం...

బొల్లాపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని వడ్డెంగుంట గ్రామానికి చెందిన గోనుగుంట్ల సుభాషిణి ప్రతిభ చాటింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం ఆమె అందుకున్నారు. ఉపాధ్యాయనిగా రాణిస్తానంటూ.. సుభాషిని ఆనందం వ్యక్తం చేసింది.



సుభాషిణికి నియామక పత్రం అందజేస్తున్న బాలకృష్ణ

నిజమైన చర్మకారులలైతే నిరూపించుకోవాలి

● టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్రావు

వయ్యకల్లు(శావల్యాపురం)సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): రాజకీయ దురుద్దేశంతో అధికార పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల వెంకట్రావు శనివారం పేర్కొన్నారు. చర్మకారుల పింఛనుపై ఫిర్యాదులు వస్తే సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఇచ్చిన ధృవీకరణ పత్రాలు ఎంపీడీవోకి సమర్పించి.. నిజమైన చర్మకారులని నిరూపించుకోవాలన్నారు. వయ్యకల్లులో రాజకీయ కక్ష సాధింపులతో నలుగురు చర్మకారుల పింఛన్లు ఆపేందుకు ప్రయత్నిస్తున్నారని వైసీపీ నేతల విమర్శలను ఆయన ఖండించారు. చర్మకారులు కానివారు అక్రమంగా పింఛన్లు పొందుతున్నారన్న ఫిర్యాదుల మేరకే అధికారులు చట్టప్రకారం విచారణ చేపట్టారన్నారు. మూడు సార్లు నోటీసులు పంపితే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.

విఠంరాజుపల్లిలో ముగ్గుల పోటీలు

వినుకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో విఠంరాజుపల్లి పంచాయతీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మహిళలకు రంగవల్లుల పోటీలు శనివారం నిర్వహించారు. స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ ప్రభాకర్‌రావు ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దడంలో మహిళలు ముందంజలో ఉండాలని కోరారు. తేజ, సైదారెడ్డి, బాజిరెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల అన్నదానం

వినుకొండ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం అన్నదానం చేశారు. బీసీ శ్యామ్ సుందర్రావు, పుష్ప ఆర్థిక సహకారం అందించారు. భువనగిరి సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, జి నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

- టీడీపీ జిల్లా అధికారప్రతినిధి జగ్గారావు

ఈపూరు, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చొరవచూపుతోందని టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. ముప్పాళ్ళ గ్రామంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి తీగలు కూడా వేశారు. జగ్గారావు మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాల సమస్యపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారని తెలిపారు. ఆయన సూచనల మేరకు స్తంబాలు వేయడం జరిగిందని అన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన విద్య

రొంపిచర్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు అంగన్ వాడీ వర్కర్లు శనివారం తెలిపారు. రొంపిచర్లలోని పడమటిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాల సందర్భంగా ఈసీసీఈ దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్ వాడీవర్కర్లు, విజయలక్ష్మి, అంజమ్మ, లక్ష్మీ, నాగమల్లేశ్వరి, కళావతి, మేడికొండ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం మత్తులో మరుగుదొడ్డి క్లీనర్ తాగిన యువకుడు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు మరుగుదొడ్డి శుభ్రం చేసే యాసిడ్ తాగేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. మండలంలోని చినతురకపాలేనికి చెందిన కాజావలి నరసరావుపేట పట్టణంలోని ఓ పూల దుకాణంలో పనిచేస్తూ ఉంటాడు. పని ముగిసిన అనంతరం మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. మత్తులోనే అతను మరుగుదొడ్డి శుభ్రం చేసే యాసిడ్ తాగాడని భార్య తెలిపింది. ప్రస్తుతం అతను నరసరావుపేట పట్టణంలోని ఓప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

ప్రసిద్ధిగాంచిన మదమంచిపాటి వీరాంజనేయస్వామి దేవాలయం

● 78 ఏళ్లుగా క్రమం తప్పకుండా కొనసాగుతున్న తిరునాళ్ల

● ప్రత్యేక ఆకర్షణగా జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

వినుకొండటౌన్: అందరి ఆత్మలో నిలిచిన శ్రీ మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం ఏటా చైత్ర బహుళ పంచమి రోజు నిర్వహిస్తుంటారు. 638 సంవత్సరంలో స్వయంబుగా వెలసిన స్వామి వారికి 78 సంవత్సరాలుగా తిరునాళ్ల మహోత్సవాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మొట్టమొదటి ప్రధాన అర్చకులు మొరుసుపల్లి వెంకటనరసాదాసు స్వామివారికి సేవలు అందించారు. 13వ తరానికి చెందిన అదే వంశానికి చెందిన రాఘవేంద్రరావు నేటికి స్వామివారి సేవలో కొనసాగుతున్నారు. మొట్టమొదటిసారిగా పెదకంచర్ల గ్రామ పురోహితులు పాలపర్తి రామబ్రహ్మం స్వామివారికి తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహించి ప్రభను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

ఊరి పేరే.. స్వామి పేరు..

వినుకొండ ప్రాంతంలో శ్రీ మదమంచిపాటి వీరాంజనేయస్వామి అవతరించిన తీరు అద్భుతం. నరసరావుపేట జమిందార్ మల్రాజు గుండా రాయనిం పరిగణలో మదమంచిపాడు గ్రామం ఉండేది. ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన సమయంలో ఏనుగుపాలెంలోని మొరుసుపల్లి వెంకట నరసాదాసు మల్రాజు గుండా రాయనింకి ఆతిథ్యం ఇచ్చేవారు. అందుకు మెచ్చిన జమిందార్ ఏనుగుపాలెం గ్రామానికి నైరుతి విభాగంలో ఉన్న మదమంచి పాడును అర్చకులకు దానం ఇచ్చారు. దానం పొందిన భూమిలో మొరుసుపల్లి వారు వ్యవసాయం ప్రారంభించిన సమయంలో.. నాగలికి ఓ పెద్దరాయి తగిలి ఎద్దు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. అక్కడి రైతుకు వీరాంజనేయ స్వామి ప్రత్యక్షమై తాను ఇక్కడ ఉన్నానని, నన్ను ప్రతిష్ఠింపజేసి కొలిచిన వారి కోర్కెలు తీరుస్తానని సెలవిచ్చారు. మొరుసుపల్లి నరసాదాసు స్వామివారిని అనేక రీతులుగా ప్రార్థించారు. స్వామివారిని ప్రతిష్ఠించి అర్చకత్వం వహించారు. చైత్ర బహుళ పంచమి నాడు తిరునాళ్లను నిర్వహిస్తూ.. భక్తులు సేవించి తరించే భాగ్యం కల్పించారు.



మదమంచిపాటి వీరాంజనేయ స్వామి మూలవిరాట్ →

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

స్వామివారి తిరునాళ్ల అంటే ఎడ్ల పోటీలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తండ్రి చిన్నరామయ్య పేరు మీదుగా గత కొన్నేళ్లగా ఎడ్ల పోటీలకు అనుకూలంగా ప్రత్యేక స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. పోటీలను రైతులు తిలకించే విధంగా ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇక్కడ జాతీయ స్థాయి ఎడ్ల పోటీలను తిలకించేందుకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లా నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ఎడ్ల యజమానులతో పాటు ప్రేక్షకులకు వారం రోజుల పాటు అన్నదానం చేస్తారు.



మదమంచిపాటి వీరాంజనేయ స్వామి దేవాలయం ←





















ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రతి నెల నాలుగో శనివారం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రజా సమస్యల పరిస్కార వేదికను నిర్వహిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుదారులు తమ అర్జీలను అందించి సమస్యలను తెలియజేశారు. సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మొత్తం నాలుగు దరఖాస్తులు అందాయి. జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

తెలుగుజాతికి ఎన్టీఆర్‌తో చారిత్రాత్మక స్థానం

● టీడీపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగు భాష, జాతిని ప్రపంచ చిత్రపటంలో ఒక చారిత్రాత్మక స్థానం కల్పించారన్నారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ నగరంలో జరిగిన మీట్ అండ్ గ్రీట్‌లో శనివారం ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆ స్థాయిని మరింత ఇనుమడింప చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్న మన యువ కేరటం నారా లోకేశ్‌ను చూసి ప్రతి తెలుగువాడు గర్వపడాల్సిన విషయం అన్నారు. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి మాట్లాడుతూ కోడెల గుర్తుకు వస్తే కోటప్పకొండ, క్యాన్సర్ ఆసుపత్రి ముందుగా గుర్తుగా వస్తాయని చెప్పారు. వీటి అబివృద్ధిలో డాక్టర్ కోడెలకు పేటెంట్ ఇవ్వవచ్చునని అన్నారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన, నల్లూరిగారు నాగేశ్వరరావు, రవి అడుసుమల్లి, మన్నవ సుబ్బారావు, యశస్వి బొడ్డలూరి, సాయి బొల్లినేని, భానను మాగలూరి, ఈశ్వర్, శ్రీరామ్, సుధీర్ కొమ్మి, ఎన్ఆర్ఐ టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ కోడెల శివరామకృష్ణను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐలు

'ఆట్యా-పాట్యా'లో జడ్పీ విద్యార్థుల ప్రతిభ

వినుకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు జడ్పీ హైస్కూల్లో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన 12వ అంతర్ జిల్లాల ఆట్యా- పాట్యా పోటీల్లో వినుకొండ జడ్పీ గర్ల్స్ హై స్కూల్ విద్యార్థినులు డి.రాజినాబీ, శ్రీలక్ష్మి, పుష్ప ప్రియ గుంటూరు జిల్లా తరపున ప్రతిభ కనపరిచినట్లు హెచ్ఎం బి.శైలజకుమారి శనివారం తెలిపారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు రూత్ మేరీ, డి.మణి, రేణుకలను అభినందించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వర్ల సాగర్‌బాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

వినుకొండటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కారంపూడి మండలం కాకానివారిపాలెం దళిత యువకుడు వర్ల సాగర్‌బాబు విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్‌షాక్‌కు గురై దివ్యాంగుడిగా మారాడని స్థానిక తహసీల్దాహర్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. సదరు విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకుని, బాధితుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. పీడీఎం సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్వలి, జి.రామకృష్ణ, ఎమ్మార్పీఎస్, సీపీఐ, సీపీఎం, మాల మహానాడు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ, రైతు నాయకులు పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

వినుకొండ పట్టణ
మాల మహానాడు కమిటీ ఎన్నిక

వినుకొండటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్యాలయంలో వినుకొండ పట్టణ మాల మహానాడు ప్రచార కార్యదర్శిగా మేకల చెన్నయ్య, మహిళా అధ్యక్షురాలిగా దారా రంగమ్మకి నియామక పత్రాన్ని నియోజకవర్గం అధ్యక్షుడు కీర్తిపాటి వెంకటేశ్వర్లు అందజేశారు. పట్టణ అధ్యక్షుడు రాయని చిన్న అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రు విజయ్, పట్టణ ఉపాధ్యక్షుడు కొట్టే మనోజ్ కుమార్, కోశాధికారి పెనుమాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పురోభివృద్ధిపై శిక్షణ

వినుకొండటౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2.0పై గ్రామ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు ఎంపీడీవో పుట్టారెడ్డి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ట్రైనర్ అలీషా మాట్లాడుతూ గ్రామాల్లో అధికారుల సమన్వయంతో 47 ప్రశ్నలకు జవాబుదారి తనం సాధిస్తే అవార్డులు సాధించవచ్చని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఏవో చుట్టూరి రవి పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ట్రైనర్ అలీషా















అలరించిన అలంకారాలు


శావల్యాపురం: మతుకుమల్లి కనకదుర్గమ్మ


ఈపూరు: కొచ్చర్లలో పార్వతీదేవికి లలితాదేవి అలంకరణ


నాదెండ్ల: మహాచండీ దేవి అవతారంలో అమ్మవారు


రొంపిచర్ల: మహాకాళిగా రొంపిచర్ల వాసవి అమ్మవారు


నరసరావుపేట: వాసవీ మాతకు గాయత్రి దేవి అలంకారం


నరసరావుపేట: శ్రీశృంగేరి శంకర మఠం దేవాలయంలో అన్నపూర్ణగా శారదాదేవిగా..


వినుకొండ: కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూల విరాట్‌కు రూ.10లక్షల కరెన్సీతో అలంకారం

నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. శనివారం శ్రీలలిత త్రిపురసుందరీదేవిగా పలు ఆలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.

- నరసరావుపేట, వినుకొండం, చిలకలూరిపేట


నరసరావుపేట: ప్రశాంతి నగర్‌లోని అమ్మవారికి గాయత్రి దేవి అలంకరణ చేసిన దృశ్యం


రొంపిచర్ల: లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో విప్పర్లలో వేంచేసి ఉన్న కామాక్షి అమ్మవారు

జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో తగ్గిన భారం

నాదెండ్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో సామాన్యులపై భారం తగ్గిందని సత్తెనపల్లి జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె.సుజాత అన్నారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద జీఎస్టీ సంస్కరణల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి పలువురికి పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపుతో ఆహార వస్తువులు, గృహోపకరణాలు, వాహనాల ధరలు తగ్గాయన్నారు. వ్యాపారులకు, ప్రజలకు ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పి.వెంకటేశ్వర్లు, ఈటీఏ సునీల్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


నాదెండ్ల: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఏసీ సుజాత

మెడికల్ వ్యాపారులకు అవగాహన

నరసరావుపేట లీగల్, సెప్టెంబర్ 27, (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై మెడికల్ వ్యాపారులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి డి.సునీత పాల్గొన్నారు. సునీత మాట్లాడుతూ జీఎస్టీ ఫలితాలు సామాన్యుల అందేవిధంగా తగ్గిన రేట్ల ప్రకారం అమ్మకాలు జరపాలన్నారు. ఏమైనా ఫిర్యాదులు వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. నరసరావుపేట, సత్తనపల్లి చిలకలూరిపేట, వినుకొండ పట్టణాల మెడికల్ వ్యాపారులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై ప్రజలకు..

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై నరసరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జీఎస్టీ అధికారి రామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాజా జీఎస్టీల తగ్గింపుల వల్ల ప్రజలకు, ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు, చిరు వ్యాపారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ప్రతి ఇంటికి సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలి సూచించారు.

ప్రభుత్వం పన్నులు తగ్గించింది

నూజెండ్ల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల పై పన్ను భారాన్ని తగ్గించిందని జీఎస్టీ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం సూపర్ జీఎస్టీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడం జయరామిరెడ్డి మాట్లాడుతూ జీఎస్టీతో ప్రజలపై పన్ను భారం తగ్గిందన్నా రు. ఎంపీడీవో పి.ఉమాదేవి, జెడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, నూజెండ్ల సొసైటీ ఛైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఎండ్లూరి వీరయ్య, ఎంఈవో కాకర్ల సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, హౌసింగ్ ఏఈ యలమంద, ఏపీవో ఆంజనేయరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎస్‌టీ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకటేశ్వరరావు

ప్రకటన

నా క్లయింటు పల్నాడు జిల్లా, రొంపిచర్ల మం, రొంపిచర్ల గ్రామ నివాసి పడాల చక్రారెడ్డి గారి భార్య కోటేశ్వరమ్మ గారు ఇచ్చిన సమాచారమును అనుసరించి యావన్మందికి తెలియజేయునది. నా క్లయింటు రొంపిచర్ల గ్రామములోని తన ఇంటి నుండి బస్టాండ్‌కు ది.25-9-2025 న ఉదయం 8.00 గంటలకు ఆటోలో వస్తుండగా చేతిలోంచి కవరు, సదరు కవరులో ఉన్న ఒరిజినల్ రిజిష్టర్ విక్రయ దస్తావేజులు అనగా మెస్సర్స్ లక్ష్మీ శ్రీనివాస డెవలపర్స్ ది.17-11-2011న నరసరావుపేట పట్టణంలో ప్రకాష్‌నగర్ కాపురస్తుడు పులిపాటి పాండురంగ దత్తాత్రేయుడు గారి కుమారుడు సత్యనారాయణ గారి పేరున వ్రాసిన రిజిష్టర్ విక్రయ దస్తావేజు (ద. నెం.20651/2011) జారి పోయినవి. సదరు దస్తావేజు నా క్లయింటు గల ప్రకాష్‌నగర్‌లోని ఇంటి దస్తావేజులు అయి వున్నవి. ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా సదరు దస్తావేజు దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు పంపగలరు. లేదా ఈ క్రింది సెల్‌ఫోన్‌కు సమాచారము ఇచ్చినయెడల నా క్లయింటు వచ్చి సదరు దస్తావేజును తీసుకొనగలరు.

నా క్లయింటు పడాల కోటేశ్వరమ్మ
సెల్ -9885523099

ఇట్లు
శ్రీగిరిరాజు నాగేశ్వరరావు
న్యాయవాది, నరసరావుపేట. సెల్ 9441081262